RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్


ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

తెలుగు దినపత్రిక

CITIZEN TIMES TELUGU DAILY

VOLUME: 17 | ISSUE: 245 | EDITOR: KANCHERLA SANDEEP KUMAR | VISAKHAPATNAM 31-3-2026 | Pages: 8 | Rs: 2/-

సంపుటి : 17 | సంచిక :245 | ఎడిటర్: కంచర్ల సందీప్ కుమార్ | విశాఖపట్నం 31-3-2026 | పేజీలు : 8 | రూ: 2/-






### రెండున్నర లక్షల మంది పేదలతో గృహ ప్రవేశం చేయించిన చంద్రబాబు

### డిసెంబర్‌లోపు మరో 4.50 లక్షల ఇళ్లు ఇస్తాం

### ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో మరో అద్భుత ఘట్టం

### గోదావరి పుష్కరాల కంటే ముందే.. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తాం

**తిరుపతి, సిటిజన్ టైమ్స్**

పేద కుటుంబాలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నదే ప్రభుత్వ నిర్ణయమని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండోసారి గృహప్రవేశాలు చేస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.50 లక్షల గృహప్రవేశాలు జరుగుతున్నాయని చెప్పారు. తిరుపతి జిల్లాలో 15,659 ఇళ్లు నిర్మించి ఇస్తున్నామన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 5.50 లక్షల ఇళ్లు నిర్మించి ఇచ్చామని, డిసెంబర్‌లోపు మరో 4.50 లక్షల ఇళ్లు కట్టించి ఇస్తామని చెప్పారు. తిరుపతి జిల్లా పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు పుదూరులోని టిడ్కో ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్కులు, వాకింగ్ ట్రాక్ ఇతర మౌలిక తరువాయి 2లో..



## పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలిపిన ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కూటమి పక్షాల ఐక్యతకు పవన్ అందిస్తున్న సహకారం ఎంతో అభినందనీయమని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా చంద్రబాబు సోషల్ మీడియాలో స్పందిస్తూ., "రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కూటమి పక్షాల ఐక్యతకు మీరు అందిస్తున్న సహకారం అభినందనీయం. నాకున్న అనుభవానికి తోడుగా, ఉత్తమ ఆకాంక్షలు, ఆదర్శాలు కలిగిన మీ వంటి ప్రజానేతలు కలిసివస్తే రాష్ట్రానికి, దేశానికి ఎంతటి మేలు జరుగుతుందో గత 20 నెలల పాలన ఒక నిదర్శనం" అని పవన్ కల్యాణ్ ను ఉద్దేశించి పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే తరువాయి 2లో..

## కేసీఆర్‌ను గృహ నిర్బంధం చేశారనేది నా అనుమానం: రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, సిటిజన్ టైమ్స్**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ విశ్రాంతి తీసుకుంటున్నారని అందరూ భావిస్తున్నారని... కానీ, ఆయన గృహ నిర్బంధంలో ఉన్నారేమో అనేది తన అనుమానం అని అన్నారు. రావణుడి వల్లే రాముడి గొప్పతనం ఏమిటో తెలిసిందని... తరువాయి 2లో..

## ప్రతి అక్రమ వలసదారునూ పంపేయాలి



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

గత పదేళ్లుగా అస్సాంలో అక్రమ చొరబాట్లను భాజపా ప్రభుత్వం అడ్డుకుందని, ఇదొక్కటే సరిపోదని, ప్రతి అక్రమ వలసదారునూ వెనక్కి పంపాల్సిందేనని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. రానున్న ఐదేళ్లలో దేశంలోని ప్రతి అక్రమ వలసదారును తరువాయి 2లో..

## రూపాయి భారీ పతనం..

### డాలర్ మారకంతో 95 స్థాయికి పడిపోయిన రూపాయి



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

భారత కరెన్సీ రూపాయి సోమవారం నాడు డాలర్ మారకంతో ఆల్‌టైమ్ కనిష్ఠాన్ని తాకింది. అంతర్జాతీయ పరిణామాలతో రూపాయి రోజురోజు నష్టపోతోంది. ఈరోజు డాలర్ మారకంతో 95.14 వద్ద కనిష్ఠస్థాయికి పడిపోయింది. రూపాయి 95 స్థాయికి పడిపోవడం ఇది మొదటిసారి. గతవారం కనిష్ఠస్థాయికి పడిపోయిన రూపాయి ఈరోజు ఉదయం కాస్త కోలుకుంది. ఈరోజు ప్రారంభంలో 130 పైసలు లాభపడి 93.59 వద్ద ప్రారంభమైంది. కానీ సెషన్ ముగిసేసరికి ఆల్‌టైమ్ కనిష్ఠానికి చేరుకుంది. రూపాయి బలహీనతకు ఎన్నో కారణాలు ఉన్నాయి. పశ్చిమాసియా తరువాయి 2లో..

## కేరళను దోచేస్తున్న ఎల్డీఎఫ్, యూడీఎఫ్

### ఈసారి రాబోయేది ఎన్డీయే సర్కారే

### అవినీతి డబ్బును రాబట్టి అభివృద్ధికి ఖర్చుచేస్తాం

### పాలక్కాడ్ సభలో ప్రధాని మోదీ

### పాలక్కాడ్‌లో చెండాను వాయిస్తున్న ప్రధాని మోదీ



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

వామపక్షాల నేతృత్వంలోని ఎల్డీఎఫ్, కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యూడీఎఫ్‌లు కేరళను దోచుకుంటూ వస్తున్నాయని ప్రధాని నరేంద్రమోదీ ఆరోపించారు. భాజపా నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ఏ ఒక్కరికో బీ టీం కాదని, నిజమైన ఏ టీం అని స్పష్టం చేశారు. ఈసారి ఎన్నికల్లో కేరళలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోయేది ఎన్డీయే అని, అవినీతిపరులు దోచుకున్న డబ్బును వసూలుచేసి రాష్ట్రాభివృద్ధికి ఖర్చు చేస్తుందని తెలిపారు. కేరళలోని పాలక్కాడ్‌లో భారీ స్థాయి ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగిస్తూ ఈ రాష్ట్రం కొన్ని దశాబ్దాలుగా స్వార్థ రాజకీయాలతో నలిగిపోతోందని చెప్పారు. కుంభకోణాల మధ్య ఎల్డీఎఫ్, యూడీఎఫ్‌లు తరువాయి 2లో..




## అత్యంత వేగవంతమైన మినీ జలాంతర్గామి సిద్ధం

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

రోడ్లపై తిరిగే కార్లను చూశాం! అదేరీతిలో నీటి అడుగున ప్రయాణించడానికి ఒక 'సూపర్ కారు' సిద్ధమైంది. ఇది ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన సబ్‌మెర్సిబుల్ (మినీ జలాంతర్గామి)గా గుర్తింపు పొందింది.. సాగర గర్భంలోని అద్భుతాలను వీక్షించడానికి, పగడపు దిబ్బలు వంటి సహజసిద్ధ వ్యవస్థలను పర్యవేక్షించడానికి ఇది ఉపయోగపడుతుంది.

**ఏమిటీ సబ్‌మెర్సిబుల్?..:** నీటి అడుగున సంచరించే వాహనాల తయారీలో రెండు దశాబ్దాలకుపైగా అనుభవమున్న యూ-బోట్ అనే డచ్ కంపెనీ ఈ సబ్‌మెర్సిబుల్‌ను నిర్మించింది. దీని ధర 57.5 లక్షల డాలర్లు. దీన్ని అండర్‌వాటర్ సూపర్ కారుగా అభివర్ణిస్తున్నారు. వేగంతోపాటు ప్రయాణికులకు విలాసవంతమైన సౌకర్యాలు ఉండేలా దీన్ని రూపొందించారు. ఈ జలాంతర వాహనంలో పైలట్ సహా ముగ్గురు ప్రయాణించొచ్చు. ఇది గంటకు 18.5 కిలోమీటర్ల వేగంతో పయనిస్తుంది. తద్వారా ప్రపంచంలోనే తరువాయి 2లో..

## గ్యాస్, పెట్రోల్ కొరత..

### ఇక 'కిరోసిన్' పంపిణీ



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

పశ్చిమాసియా ఉద్రిక్తతలు మన వంట గదిలోనూ మంట పెట్టాయి. హర్మూజ్ జలసంధిలో చమురు రవాణాకు అంతరాయం ఏర్పడటంతో దేశంలో గ్యాస్, ఇంధనాల కొరత నానాటికీ తీవ్రమవుతోంది. దీంతో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. వంట గ్యాస్ సమస్య తగ్గించేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అన్ని రాష్ట్రాలకు సుపీరియర్ కిరోసిన్ తరువాయి 2లో..

## బ్యాకింగ్ వ్యవస్థలోకి రూ.84 వేల కోట్లు ప్రవేశపెట్టిన ఆర్బీఐ





**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

బ్యాంకింగ్ వ్యవస్థలో నగదు లభ్యతను (లిక్విడిటీ) పెంచేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) సోమవారం కీలక చర్యలు చేపట్టింది. రెండు వేరియబుల్ రేట్ రెపో (వీఆర్ఆర్) వేలాల ద్వారా మొత్తం రూ.84,582 కోట్లను వ్యవస్థలోకి చొప్పించింది. ఆర్థిక వ్యవస్థలో నిధుల ప్రవాహాన్ని సులభతరం చేయడమే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకున్నట్లు ఆర్బీఐ ఒక ప్రకటనలో తెలిపింది. తొలుత వీఆర్ఆర్ వేలంలో రూ.50,001 కోట్లను 5.44 శాతం వెయిటెడ్ యావరేజ్ రేటుకు విడుదల చేసింది. ఆ తర్వాత నిర్వహించిన మరో వేలంలో రూ.34,581 కోట్లను 5.30 శాతం వెయిటెడ్ యావరేజ్ రేటుకు బ్యాంకులకు అందించింది. మొదటి వేలానికి మంచి స్పందన రాగా, రెండో వేలానికి అడిగిన మొత్తం కంటే తక్కువ బిడ్లు దాఖలయ్యాయి. ప్రస్తుతం బ్యాంకింగ్ వ్యవస్థలో మార్చి 27 నాటికి సుమారు రూ.1.27 లక్షల కోట్ల మిగులు నిధులు ఉన్నాయని అంచనా. గత కొన్ని రోజులుగా వీఆర్ఆర్ వేలాల ద్వారా ఆర్బీఐ రూ.2,73,530 కోట్ల తాత్కాలిక ద్రవ్య లభ్యతను కల్పించింది. అంతకుముందు, 2026 జనవరి నుంచి ఓపెన్ మార్కెట్ ఆపరేషన్ల (ఓఎంఓ) ద్వారా ప్రభుత్వ సెక్యూరిటీలను కొనుగోలు చేసి రూ.3.50 లక్షల కోట్ల శాశ్వత ద్రవ్య లభ్యతను పెంచింది. ఇదిలా ఉండగా, కేంద్ర ప్రభుత్వం 2026-27 ఆర్థిక తరువాయి 2లో..

## హర్మూజ్‌లో సీమైన్ల పనిపట్టేందుకు..

## అండర్‌వాటర్ డ్రోన్లు..



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

హర్మూజ్ జలసంధిలో శత్రునౌకలను టార్గెట్ చేసేలా 'సీమైన్స్' లేదా 'నేవల్ మైన్స్'ను ఇరాన్ ఉపయోగిస్తోన్న సంగతి తెలిసిందే. అమెరికా మిత్రదేశాల నౌకలు అడుగుపెడితే పేలిపోయేలా జలసంధి (ాత్తీఖత్ాట ఎశీతీఎబఓ)లో వాటిని పరిచింది. ఇప్పుడు వాటి పనిపట్టేందుకు అండర్‌వాటర్ డ్రోన్లను రంగంలోకి దింపాలని యూకే యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ డ్రోన్లను తమ రాయల్ ఫ్లీట్ తరువాయి 2లో..

## ఎడిటోరియల్

### కార్యకర్తలకు టికెట్లు....

# టీడీపీ బంపర్ ఆఫర్


ఏపీలో పెద్ద ఎత్తున అసెంబ్లీ పార్లమెంట్ సీట్లు పెరగబోతున్నాయి. దాంతో అనేక మంది కొత్త నాయకులు రంగంలోకి వచ్చే అవకాశాలు ఏర్పడ్డాయి. సంప్రదాయ రాజకీయ కుటుంబాలు అలాగే సీనియర్లతో పాటు కొత్త వారూ ఈసారి ఎన్నికల రణ క్షేత్రంలో కనిపించబోతున్నారు అని అంటున్నారు. తెలుగుదేశం పార్టీ 45 వ వార్షికోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కార్యకర్తలకు పెద్ద పీట వేశారు వారినే వేదిక మీద కూర్చోబెట్టారు. వారితో కలసి తన నివాసంలో విందు భోజనం ఆరగించారు. చంద్రబాబు లోకేష్ ఈ ఇద్దరూ కార్యకర్తలు పార్టీకి జీవ గర్రలు అని నినదించారు. చంద్రబాబు అయితే మరో అడుగు ముందుకేసి పార్టీ అంటే కార్యకర్తలే అని స్పష్టం చేశారు. ఏ నాయకుడు అయినా కార్యకర్తలను దూరం పెడితే ఆ నాయకుడిని సైతం పార్టీకి దూరం పెట్టడానికి తాను వెనకాడబోము అని బాబు హెచ్చరించారు. కార్యకర్తల కష్ట సుఖాలు తెలుసుకోవాలని వారితోనే మమేకం కావాలని ఆయన సూచించారు. కార్యకర్తలను ఇబ్బంది పెట్టే నాయకులు ఎవరైనా తమకు అవసరం లేదని బాబు ఖండితంగా చెప్పేశారు. ఇదిలా ఉంటే భవిష్యత్తులో పార్టీలో పనిచే వారికి పెద్ద పీట వేస్తామని బాబు హామీ ఇచ్చారు. ఏకంగా 50 శాతం పైగా అదనం సీట్లు ఏపీకి రాబోతున్నాయని బాబు చెప్పారు. అలాగే మహిళా రిజర్వేషన్లు కూడా వస్తున్నాయని గుర్తు చేశారు. వీటి నేపథ్యంలో బాగా పనిచేసే వారికి పార్టీకి అవకాశాలు కల్పిస్తుందని బాబు చెప్పారు. పార్టీ కోసం ఎవరు బాగా కష్టపడి పనిచేస్తారో వారికే చాన్స్ అని బాబు మనసులో మాట చెప్పేశారు వారే ప్రజా ప్రతినిధులు అవుతారని కూడా బంపర్ ఆఫర్ ఇచ్చారు అందువల్ల బాగా పనిచేయాలని ఆయన సూచించారు. పార్టీలో ఎవరు బాగా పనిచేస్తున్నారో చూసే బాధ్యతని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ కి అప్పగిస్తున్నామని చంద్రబాబు చెప్పారు. లోకేష్ ఈ విధయంలో మోనిటరింగ్ చేస్తారు అని అన్నారు. టీడీపీలో ప్రతీ కార్యకర్త పనితీరుని ఆయన మధింపు చేస్తారు అని చెప్పారు. అందువల్ల అంతా కష్టపడాలని బాబు సూచించారు. అంతే కాదు పార్టీలో నాయకులు కానీ కార్యకర్తలు కానీ క్రమశిక్షణతో మెలగాలని బాబు కోరారు. మంచి ప్రవర్తన ద్వారానే పదవులు అందుకుంటారని చెప్పారు పార్టీ బ్రాండ్ అన్నది చాలా ముఖ్యమని బాబు చెబుతూ ఆ విధంగా ఆదర్శంగా నాయకులు కార్యకర్తలు ఉండాలని దిశా నిర్దేశం చేశారు. టీడీపీ వయసు 45 ఏళ్ళు. దాంతో పాత తరానికి నెమ్మదిగా దూరం పెట్టి కొత్త తరానికి ఆహ్వానం పలకాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ విషయం మీద 2024 ఎన్నికల్లోనే టీడీపీ కొంత కసరత్తు చేసింది. డీ లిమిటేషన్ ప్రక్రియతో సీట్లు పెరగడంతో టీడీపీ ఈసారి మరింతమంది కొత్త వారిని ప్రోత్సహించాలని చూస్తోంది. దాంతో ఈసారి గోల్డెన్ చాన్స్ అని అంటున్నారు. లోకేష్ సైతం యువతకు అధిక ప్రాధాన్యత ఇస్తారు కాబట్టి బాగా పనిచేసే కార్యకర్తలు నేరుగా ఎమ్మెల్యే ఎంపీ వంటి కీలక పదవులు చేపట్టేందుకు పూర్తి స్థాయిలో అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. మరి అధినేత చంద్రబాబు ప్రకటించిన ఆ ఆఫర్ ని ఎంతమంది అందుకుని అదృష్టవంతులు అవుతారో చూడాల్సి ఉంది.

# గ్యాస్, పెట్రోల్ కొరత..

## ఇక 'కిరోసిన్' పంపిణీ

పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు చమురు మంత్రిత్వశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ పంపిణీ చేయాలని కేంద్రం నిర్ణయించింది. కేవలం వంట, దీపాలు వెలిగించడం కోసమే షరతులకు లోబడి ఈ పంపిణీని చేపట్టనున్నట్లు కేంద్రం తెలిపింది. దీంతో పాటు లైసెన్స్ పొందిన సర్వీస్ స్టేషన్‌లలో 2,500 లీటర్ల వరకు కిరోసిన్ నిల్వ చేసుకునేందుకు వెసులుబాటు కల్పించింది. 60 రోజుల పాటు లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయని కేంద్రం తెలిపింది. సుపీరియర్ కిరోసిన్ ఆయిల్ అనేది ముడిచమురు రిఫైనరీ ప్రక్రియ నుంచి వచ్చే ఉప ఉత్పత్తి. ఇది అత్యంత శుద్ధి చేసిన కిరోసిన్. దీన్ని ప్రధానంగా వంటకు, దీపాలు వెలిగించేందుకు వినియోగిస్తారు. సాధారణ లో-గ్రేడ్ కిరోసిన్‌తో పోలిస్తే ఇందులోనుంచి వెలువడే వాయువులు తక్కువ. పొగ కూడా తక్కువగా వెలువడుతుంది.

# రెండున్నర లక్షల మంది పేదలతో గృహ ప్రవేశం చేయించిన చంద్రబాబు






సదుపాయాలతో ఈ గృహ సముదాయాలను నిర్మించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. అర్బన్ కింద కేంద్రం ఇచ్చిన డబ్బులను గత ప్రభుత్వం దుర్వినియోగం చేసిందన్నారు. " గత ప్రభుత్వం రూ.816 కోట్లు అప్పు పెట్టింది. నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో ఇళ్లు కట్టేందుకు యత్నించింది. పేదలు ఇళ్లు కట్టుకోలేని పరిస్థితి కల్పించింది. పోలవరాన్ని నాశనం చేసింది. గోదావరి పుష్కరాల కంటే ముందే.. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తాం. ఏపీకి సుదీర్ఘమైన తీర ప్రాంతం ఉంది. మత్స్యకారులకు ఉపయోగపడాలి. వేట నిషేధం సమయంలో ఇచ్చే ఆర్థికసాయాన్ని రూ.20వేలకు పెంచాం. సుపరిపాలన అందించేందుకు కృషి చేస్తున్నాం. సాంకేతికతతో ఎప్పటికప్పుడు అనుసంధానం చేస్తున్నాం. మనమిత్ర, వాట్సప్ గవర్నెన్స్ తీసుకొచ్చాం. నిన్ననే అమరావతి రాజధానిపై తీర్మానం చేసి కేంద్రానికి పంపాం. చట్టం రూపుదాల్చాక రాజధానిని ఎవరూ కదల్చలేరు. హైదరాబాద్, చెన్నై కంటే అమరావతిని నెంబర్ వన్‌లో నిలబెడతాం. 63 లక్షల మందికి మొదటి తేదీనే పింఛన్లు ఇస్తున్నాం. ఎంతమంది పిల్లలున్నా తల్లికి వందనం ఇస్తున్నాం. స్త్రీశక్తి కింద మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం. అభివృద్ధి కార్యక్రమాలతోపాటు సంక్షేమం అందిస్తున్నాం" అని చంద్రబాబు అన్నారు.

**ఓ ఇంటికి గుమ్మడికాయ కట్టిన సీఎం చంద్రబాబు...:** రాష్ట్రవ్యాప్తంగా పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ ప్రభుత్వం చేపట్టిన 2.5 లక్షల టిడ్కో ఇళ్ల సామూహిక గృహప్రవేశాల కార్యక్రమం సోమవారం పండుగ వాతావరణంలో జరిగింది. తిరుపతి జిల్లా, సూళ్లూరుపేట నియోజకవర్గంలోని నాయుడుపేటలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా పాల్గొని ఈ బృహత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన లబ్ధిదారులతో కలిసి వారి కొత్త ఇళ్లలోకి ప్రవేశించి శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా ముఖ్యమంత్రి, లబ్ధిదారురాలైన ముక్కర అంబిక ఇంటికి వెళ్లి గృహప్రవేశ వేడుకలో పాల్గొన్నారు. వారి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన సత్యనారాయణ స్వామి వ్రతంలో కూర్చుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం, మరో లబ్ధిదారురాలైన షేక్ నూరి ఇంటికి వెళ్లారు. అక్కడ వారి సంప్రదాయం ప్రకారం జరిగిన గృహప్రవేశ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. నూరి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసి, వారిని ఆశీర్వదించారు. ఒకే వేదికపై హిందూ, ముస్లిం లబ్ధిదారుల ఇళ్లలో జరిగిన వేడుకల్లో ముఖ్యమంత్రి పాల్గొనడం మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు కొలుసు పార్థసారధి, పొంగూరు నారాయణ, అనగాని సత్యప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే విజయశ్రీ, పలువురు ఉన్నతాధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# సాగర గర్భంలో సూపర్ కారు

అత్యంత వేగవంతమైన సబ్‌మెర్సిబుల్‌గా ఇది నిలిచింది. డాల్ఫిన్లు కూడా దాదాపుగా ఇంతే వేగంతో పయనిస్తాయి. ఈ తరహా చిన్నపాటి జలాంతర్గాములు చాలావరకూ గరిష్ఠంగా గంటకు 7 కిలోమీటర్ల వేగాన్ని మాత్రమే కలిగి ఉన్నాయి. ఈ మినీ జలాంతర్గామి.. నీటి ఉపరితలం నుంచి 300 మీటర్ల లోతు వరకూ వెళ్లగలదు. నీటిలో 45 డిగ్రీల కోణంలో పైకి, కిందకి ఇది ప్రయాణించగలదు. ఈ వెసులుబాటు వల్ల అది సంక్లిష్టమైన జలాల్లో సులువుగా పయనించగలుగుతుంది. సంప్రదాయ సబ్‌మెర్సిబుళ్ల కన్నా మెరుగైన నియంత్రణను కలిగి ఉంటుంది. హైడ్రోడైనమిక్ డిజైన్, అధునాతన చోదక వ్యవస్థ కారణంగా ఇది సాఫీగా, వేగంగా ప్రయాణించగలుగుతుంది. సబ్‌మెర్సిబుల్‌లోని షార్క్ కంట్రోలర్.. హైడ్రోఫాయిల్స్, థ్రస్టర్లతో అనుసంధానమై ఉంటుంది. దీనివల్ల ప్రయాణంలో కచ్చితత్వం, ఒడుపు సాధ్యమవుతున్నాయి. ఈ సబ్‌మెర్సిబుల్‌లోని వైడ్ యాంగిల్ సోనార్ వ్యవస్థ సముద్రగర్భాన్ని స్కాన్ చేసి, మార్గనిర్దేశం చేస్తుంది. ఇందులో జీవనాధార వ్యవస్థలు, మెరుగైన భద్రత కోసం నియంత్రణ సాధనాలు ఉన్నాయి. అత్యవసర సమయంలో 96 గంటల పాటు ప్రయాణికులు మనుగడ సాగించగలరు.

**విమాన ప్రయాణం తరహాలో..**

నీటి అడుగున విమానయానం తరహా అనుభవాన్ని అందించేలా ఈ సబ్‌మెర్సిబుల్‌ను డిజైన్ చేశారు. డైవింగ్ సమయంలో ఇది హైడ్రోడైనమిక్ లిఫ్ట్ సాయంతో సాఫీగా గ్లైడింగ్ విన్యాసాన్ని చేపట్టగలదు. రెక్క తరహాలో ఉండే దీని ఆకృతి స్థిరత్వాన్ని పెంచుతుంది.

**అద్భుత వీక్షణం..**

ఈ సబ్‌మెర్సిబుల్ బాడీ పారదర్శకంగా ఉంటుంది. అందువల్ల సముద్రంలోని అద్భుత ప్రపంచాన్ని నలు దిక్కుల నుంచి ప్రయాణికులు వీక్షించొచ్చు. సీటింగ్‌ను కూడా ఇదే రీతిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. అవసరాన్ని బట్టి ఈ సబ్‌మెర్సిబుల్‌ను నౌకలతో అనుసంధానించడం ద్వారా కానీ విడిగా కానీ ఉపయోగించొచ్చు. వెనెజువెలాకు ఉత్తరాన ఉన్న కురాకావో దీవి వద్ద దీన్ని పరీక్షిస్తున్నారు. కొద్దివారాల్లో దీన్ని యజమానికి అందించే అవకాశం ఉంది.

**సబ్‌మెర్సిబుల్ లెక్కలివీ..**

పొడవు 6.5 మీటర్లు

వెడల్పు 3.27 మీటర్లు

బ్యాటరీ సామర్థ్యం 62 కిలోవాట్ అవర్ (ఏకబిగిన 8 గంటల పాటు శక్తిని అందించగలదు)

చోదక వ్యవస్థ 25 కిలోవాట్ల సామర్థ్యమున్న నాలుగు, 6 కిలోవాట్ల సామర్థ్యమున్న రెండు మోటర్లు.

# కేరళను దోచేస్తున్న ఎల్డీఎఫ్, యూడీఎఫ్

అధికారాన్ని మార్చుకుంటూ.. జేబులు నింపుకొంటూ వచ్చాయని, ఒకదానిపై ఒకటి ఎన్నడూ చర్యలు తీసుకోలేదని విమర్శించారు.

**మార్పును కోరుకుంటున్న ప్రజలు**

కేరళ ప్రజలు అధికార మార్పు కోరుకుంటున్నారని, ఆ సంకేతం స్పష్టంగా కనిపిస్తోందని మోదీ చెప్పారు. కేరళను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఎన్డీయే తీర్చిదిద్దుతుందని, 'మోదీ హామీల గ్యారంటీ'లతో రాష్ట్రం ముందుకు సాగుతుందని తెలిపారు. "కేరళ ఇప్పుడు రూ.5 లక్షల కోట్లకు పైగా రుణభారంతో సతమతమవుతోంది. ఉద్యోగులకు సమయానికి జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రానికి న్యాయబద్ధంగా రావాల్సిన నిధులు, తమ కఠోర శ్రమ ఎక్కడికి పోతున్నట్లు అని ప్రజలు అడుగుతున్నారు. దానికి సమాధానం ఒక్కటే.. అది ఎల్డీఎఫ్ (సీఎం పినరయి విజయన్ ప్రభుత్వం) జేబుల్లోకి వెళ్తోంది" అని ఆరోపించారు.

**అవి ఎక్కడ ఉన్నా నాశనమే..:** "కాంగ్రెస్, వామపక్షాలు ఎక్కడ అధికారంలోకి వచ్చినా అంతా నాశనం చేస్తాయనే ట్రాక్ రికార్డ్ ఉంది. బెంగాల్, త్రిపురలను కమ్యూనిస్టులు ఏం చేశారో దేశం మొత్తానికి తెలుసు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఏం చేసిందో అందరూ చూశారు. అవే దుర్మార్గపు పథకాలతో కేరళను కూడా నాశనం చేశారు. జాతీయ స్థాయిలో, అనేక రాష్ట్రాల్లో ఈ రెండు కూటములు కలిసి పనిచేస్తాయి. రాష్ట్రంలో మాత్రం ప్రత్యర్థులుగా నటిస్తాయి. కాంగ్రెస్ అధికారంలో ఉన్నచోట కూడా పరిస్థితి దారుణంగానే ఉంది" అని మోదీ విమర్శించారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం సాధ్యమైనంత తక్కువగా పడేలా తమ ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తుంటే కాంగ్రెస్ మాత్రం రాజకీయ లబ్ధికోసం ప్రవాస గల్ఫ్‌వాసుల జీవితాలను ప్రమాదంలో పడేస్తోందని ఆరోపించారు. తొలుత వేదికపై కేరళ సంప్రదాయ వాయిద్యం 'చెండా'ను వాయించి ప్రజల్ని ఉత్సాహపరిచారు. పాలక్కాడ్ నుంచి త్రిశ్శూర్‌కు చేరుకున్న మోదీ పెద్దఎత్తున రోడ్ షో నిర్వహించారు.

## బ్యాకింగ్ వ్యవస్థలోకి రూ.84 వేల కోట్లు ప్రవేశపెట్టిన ఆర్బీఐ

సంవత్సరం తొలి అర్ధ భాగంలో (ఏప్రిల్-సెప్టెంబర్) చేపట్టనున్న రుణ సేకరణ వివరాలను ప్రకటిం చింది. ఆర్బీఐతో సంప్రదింపుల తర్వాత తొలి ఆరు నెలల్లో రూ.8.20 లక్షల కోట్లను సమీకరించాలని నిర్ణయించింది. ఈ రుణాలను డేటెడ్ సెక్యూరిటీలు, సావరిన్ గ్రీన్ బాండ్ల జారీ ద్వారా సేకరించనుంది.

మొదటి పేజీ తరువాయి

# పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబు

లక్ష్యంగా ఏర్పడిన తమ కూటమి ఐక్యతా స్ఫూర్తి ఇలాగే పదికాలాల పాటు కొనసాగాలని చంద్రబాబు ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రగతి ప్రస్థానంలో పవన్ కల్యాణ్ వంటి నేతల పాత్ర కీలకమని, ఆయన తోడ్పాటుతో రాష్ట్రాన్ని మరింత ముందుకు తీసుకువెళతామని చంద్రబాబు తన సందేశంలో స్పష్టం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య ఉన్న సమన్వయం రాష్ట్రానికి శుభపరిణామమని ఆయన అభిప్రాయపడ్డారు.

## కేసీఆర్‌ను గృహ నిర్బంధం చేశారనేది నా అనుమానం: రేవంత్ రెడ్డి

అలాగే కేసీఆర్ ఉండటం వల్ల తనకు గుర్తింపు వచ్చిందని చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజనపై బీజేపీ నేత కె. లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలపై రేవంత్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. అవి అవగాహన లేని వ్యాఖ్యలని, లక్ష్మణ్ ఎలా డాక్టర్ అయ్యారో అర్థం కావడం లేదని ఘాటుగా విమర్శించారు. నియోజకవర్గాల సంఖ్య పెరిగినా భౌగోళికంగా గ్యాప్ అలాగే ఉంటుందని, ఈ విషయంలో తెలంగాణను తెలివిగా మోసం చేస్తున్నారని ఆరోపించారు. సీట్ల పెంపు విషయంలో ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తోందని అన్నారు. కేంద్రానికి కేవలం ఐదు ఉత్తరాది రాష్ట్రాల సీట్లు సరిపోతాయని, అదే జరిగితే దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సీట్ల పెంపులో ఈ వ్యత్యాసం కొనసాగితే భవిష్యత్తులో బండి సంజయ్, కిషన్ రెడ్డి వంటి నేతలకు రాజకీయంగా అవకాశాలు ఉండవని, దేశంలో నియంత పోకడలు పెరుగుతాయని సెటైర్లు వేశారు.

## ప్రతి అక్రమ వలసదారునూ పంపేయాలి

పంపించివేస్తామని పేర్కొన్నారు. అస్సాంలోని ఢెకియాజులీలో ఆదివారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. అక్రమ వలసదారులు అస్సాం యువత ఉపాధిని లాక్కుంటున్నారని, పేదల ఆహారాన్ని కొల్లగొడుతున్నారని తెలిపారు. చొరబాటుదార్లను రక్షించడానికే ఓటర్ల జాబితాల సవరణను (సర్) కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. అస్సాంలో హ్యాట్రిక్ సాధిస్తామని భాజపా అధ్యక్షుడు నితిన్ నబీన్ స్పష్టం చేశారు. మార్గరిటాలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఓటు బ్యాంకు రాజకీయాలు చేశాయని విమర్శించారు.

## హర్మూజ్‌లో సీమైన్ల పనిపట్టేందుకు.. అండర్‌వాటర్ డ్రోన్లు..

నౌకల్లో అమర్చేందుకు ప్రణాళిక చేస్తోంది. ఆ డ్రోన్ల సాయంతో ఆ సీమైన్స్‌ను గుర్తించి, నిర్వీర్యం చేయనుంది. అమెరికా తన మిత్రదేశాలతో కలిసి చేపట్టే భద్రతా మిషన్‌లో భాగంగా యూకే తన ఆర్ఎఫ్ఏ లైమ్‌బే నౌక (సపోర్ట్ షిప్)ను పశ్చిమాసియాకు పంపేందుకు సన్నాహాలు చేస్తోంది. బ్రిటన్‌కు చెందిన రాయల్ నేవీ ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా వెల్లడించింది. ఆ నౌక మైన్‌హంటింగ్ సామర్థ్యాలను పెంచుతున్నట్లు పేర్కొంది. ఆర్ఎఫ్ఏ లైమ్‌బేలో మామూలుగా నేవీకి సంబంధించిన పరికరాలు, వాహనాలు, బలగాలను తరలిస్తుంటారు. ఇప్పుడు దీనిని అప్‌గ్రేడ్ చేయనున్నారు. ఆ సీమైన్స్‌ను తొలగించడానికి చేపట్టనున్న ఆపరేషన్‌లో మామూలుగా వాడే మైన్ క్లియర్ షిప్‌లతో పాటు ఏఐతో నడిచే స్వయంప్రతిపత్తిగల డ్రోన్లను ఉపయోగించాలన్నది ప్లాన్. ఈ డ్రోన్లు సెన్సర్లను వాడి సముద్రగర్భాన్ని స్కాన్ చేస్తాయి. సీమైన్స్‌ను గుర్తించి నిర్వీర్యం చేస్తాయి. అదే సమయంలో ఈ ఆపరేషన్‌లో భాగంగా యుద్ధ నౌకలు, ఎయిర్‌క్రాఫ్ట్‌లను పంపి ఇంధన నౌకలకు సురక్షిత కారిడార్లను ఏర్పాటు చేయనున్నారు. ఇక అమెరికా పశ్చిమాసియాలో వేలాది మంది మెరైనర్లను మోహరించింది. గ్రౌండ్ ఆపరేషన్ లక్ష్యంగా వారిని పంపినట్లు వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. కాగా.. ఇరాన్ వద్ద దాదాపు 2,000 నుంచి 6,000 వరకు సీమైన్స్ ఉన్నట్లు అంచనాలు ఉన్నాయి. వీటిని చైనా, రష్యా నుంచి కొనుగోలు చేయడంతోపాటు.. సొంతంగా కూడా ఉత్పత్తి చేస్తోంది. 1980ల్లో ట్యాంకర్ వార్ వేళ భారీ సంఖ్యలో సీమైన్లను వాడి నౌకలను ధ్వంసం చేశారు. అదే సమయంలో సీమైన్స్‌ను తొలగించే మైన్‌స్వీపర్స్ పనితీరు చెప్పుకోదగ్గస్థాయిలో లేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే అండర్‌వాటర్ డ్రోన్లను దింపాలనుకున్నట్లు తెలుస్తోంది.

# రూపాయి భారీ పతనం..

యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరుగుతున్నాయి. బ్రెంట్ క్రూడాయిల్ ధర బ్యారెల్‌కు 109 డాలర్లకు పైన ఉంది. దీనితో విదేశీ పెట్టుబడిదారులు దేశీయ మార్కెట్ల నుంచి నిధులను ఉపసంహరించుకుంటున్నారు. ఈ నెలలో విదేశీ పెట్టుబడిదారులు దేశీయ మార్కెట్ల నుంచి సుమారు 11.5 బిలియన్ డాలర్లను వెనక్కి తీసుకున్నట్లు తెలుస్తోంది. గత శుక్రవారం సుమారు రూ.850 కోట్ల విలువైన ప్రభుత్వ సెక్యూరిటీలను విదేశీ పెట్టుబడిదారులు విక్రయించారు. ఇలా వివిధ కారణాలతో రూపాయి అత్యంత బలహీనమవుతోంది.

# అనకాపల్లి జిల్లా పోలీస్ శాఖకు గర్వకారణం

## 14 మందికి డీజీపీ కమండేషన్ డిస్క్ అవార్డులు





**సిటిజన్ టైమ్స్,అనకాపల్లి, మార్చి 30:**

పోలీస్ శాఖలో అంకితభావంతో విధులు నిర్వహిస్తూ, అసాధారణ ప్రతిభ కనబరిచిన అధికారులను ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఇచ్చే ప్రతిష్టాత్మక డీ.జీ.పీ కమండేషన్ డిస్క్అవార్డులు 2025 సంవత్సరానికి గాను ప్రకటించబడ్డాయి. ఈ పతకాల జాబితాలో అనకాపల్లి జిల్లాకు చెందిన 14 మంది పోలీస్ అధికారులు మరియు సిబ్బంది చోటు సంపాదించుకోవడం జిల్లా పోలీస్ శాఖకు గర్వకారణంగా నిలిచింది. ఈ 14 అవార్డులలో 3 సిల్వర్ (వెండి) మరియు 11 బ్రాంజ్ (కాంస్య) పతకాలు ఉన్నాయి.

**అవార్డు గ్రహీతల వివరాలు:**

డీజీపీ సిల్వర్ డిస్క్ గ్రహీతలు:

ఎల్.అప్పారావు,పీసీ-2340 (సబ్బవరం పి.ఎస్.)

వై.నరసింహ మూర్తి, పీసీ-255 (కె.డి.పేట పి.ఎస్.)

కె.రమణ,పీసీ-418 (మునగపాక పి.ఎస్.)

**డీజీపీ బ్రాంజ్ డిస్క్ గ్రహీతలు:**

వై.తారకేశ్వర రావు, ఎస్సై (కె.డి. పేట పి.ఎస్.)

బి.సురేష్ బాబు, ఎస్సై (ఐ.టి కోర్)

బి.అప్పారావు,ఏఎస్సై-886 (కొత్తకోట పి.ఎస్.)

బి.శ్రీనివాస రావు,హెచ్.సి-1528 (సబ్బవరం పి.ఎస్.)

ఎం.హేమంత కుమార్, హెచ్.సి-1544 (డి.సి.ఆర్.బి)

ఎస్.వరాహ బాబు, హెచ్.సి-1486 (డి.ఎస్.బి)

కె.చిరంజీవి,హెచ్.సి-2003 (కె.డి.పేట పి.ఎస్.)

బి.సత్యనారాయణ, పీసీ-2331 (పరవాడ పి.ఎస్.)

బి.గోవింద రావు, పీసీ-462 (ఐటి కోర్)

పి.ఎస్.జి.పవన్ కుమార్, పీసీ-409 (పాయకరావుపేట పి.ఎస్.)

ఏ.ఎస్.కృష్ణ మూర్తి, ఏ.ఆర్ పీసీ-2573 (డి.ఏ.ఆర్)

ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్ పతకాలు సాధించిన సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఐటి కోర్ ఎస్సై బి.సురేష్ బాబు, పీసీలు బి.గోవింద రావు, ఏ.ఎస్.కృష్ణ మూర్తి మరియు డి.సి.ఆర్.బి హెచ్.సి ఎం.హేమంత కుమార్ లకు ఎస్పీ స్వయంగా పతకాలు మరియు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ లక్షణా మూర్తి, సైబర్ క్రైమ్,సోషల్ మీడియా ఇన్స్పెక్టర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు. పోలీస్ సిబ్బంది నిరంతరం ప్రజల రక్షణ కోసం శ్రమిస్తూ, వృత్తిపరమైన నైపుణ్యాలను ప్రదర్శించాలి. ఇలాంటి అవార్డులు సిబ్బందిలో ఉత్సాహాన్ని నింపుతాయని, భవిష్యత్తులో మరింత మంది సిబ్బంది ప్రశంసాపూర్వకమైన విధులు నిర్వహించి జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు.

# పి 4 సేవలో మార్గదర్శకులకు ప్రశంసలు

### పి గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



**పి గన్నవరం సిటిజన్ టైమ్స్ మార్చి 30**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, పి. గన్నవరం మండలం ధనవర్ష ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పి4 యానివర్సరీ కార్యక్రమంలో పి. గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కోనిదెల పవన్ కళ్యాణ్ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి4 కార్యక్రమం విజయవంతంగా ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్గదర్శకులుగా సేవలందిస్తున్న వారిని ప్రశంసించారు. ముఖ్యంగా తాలూరి శ్రీకాంత్, చిన్న వయసు నుంచే కష్టపడి చదువుకొని విదేశాలకు వెళ్లి, అక్కడే ఆగిపోకుండా తన స్వగ్రామానికి సేవ చేయాలనే ఉద్దేశంతో ప్రతిరోజూ అన్న క్యాంటీన్ నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆకుల వెంకటరత్నం నాయుడు గంగలకుర్రు ఎంపీపీ స్కూల్‌లో బాత్రూములు లేకపోవడంతో వాటిని నిర్మించి, స్కూల్ పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేయడం గొప్ప సేవ అని అన్నారు. ఇంకా కె.యం.రాజా పేదలకు ఉచితంగా మందులు అందించడం ద్వారా సమాజానికి సేవ చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమం నుంచి ప్రేరణ పొందిన తెలుగుదేశం పార్టీ కో-కన్వీనర్ శ్రీ మోకా ఆనంద్ సాగర్ మార్గదర్శిగా చేరి పేదలకు సేవ చేస్తానని ప్రమాణం చేయడం అభినందనీయమని తెలిపారు. వారికి కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పబ్లిక్-ప్రైవేట్-పీపుల్ పార్ట్నర్‌షిప్ ( పి4) ద్వారా నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని, ఇంకా పేదలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసి వారి అభివృద్ధి కోసం కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.





# వారసత్వ రాజకీయాలు

## సేవ చేసిన వారికి స్థానం ఎక్కడ?

### దశాబ్దాలుగా కష్టపడ్డవారికి గుర్తింపు ఉందా?

### లేక రాజకీయాలు కుటుంబాలకే పరిమితమవుతున్నాయా?

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్ బ్యూరో, మార్చి 30:**

రాష్ట్ర రాజకీయాల్లో రోజురోజుకీ వారసత్వ రాజకీయాల ప్రభావం పెరుగుతోంది. ఒక నాయకుడు వరుసగా నాలుగు నుంచి ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి తన ప్రాంతంలో బలమైన స్థానం సంపాదించుకుంటాడు. కాలక్రమంలో, అదే నాయకుడి కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా కుమారులు లేదా బంధువులు రాజకీయ రంగంలోకి ప్రవేశించి అదే స్థానానికి పోటీ చేయడం సాధారణంగా మారింది. ఈ పరిణామం మధ్యలో, గత 25 నుంచి 30 సంవత్సరాలుగా పార్టీకి అంకితభావంతో పనిచేస్తున్న సీనియర్ నాయకుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతోంది. పార్టీ కోసం కష్టపడి, ప్రజల్లో మంచి పేరు సంపాదించినప్పటికీ, వారికి టికెట్లు దక్కకపోవడం, కీలక అవకాశాలు కోల్పోవడం వంటి పరిస్థితులు కనిపిస్తున్నాయి. వారసత్వ రాజకీయాలకు అనుకూలంగా మాట్లాడేవారు, రాజకీయ కుటుంబాల్లో పెరిగిన వారికి ప్రజా సమస్యలపై అవగాహన ఎక్కువగా ఉంటుందని, వారు త్వరగా నాయకత్వాన్ని అందిపుచ్చుకోగలరని చెబుతున్నారు. అంతేకాకుండా, ఇప్పటికే ప్రజల్లో గుర్తింపు ఉన్న కుటుంబం కావడంతో, అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతాయని వారు వాదిస్తున్నారు. అయితే విమర్శకులు మాత్రం దీన్ని ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అభిప్రాయ పడుతున్నారు. రాజకీయాలు కొద్దిమంది కుటుంబాలకే పరిమితమవడం వల్ల సామాన్య కార్యకర్తలకు అవకాశాలు తగ్గిపోతున్నాయని, కష్టపడి ఎదిగిన నాయకుల ప్రతిభను పక్కనబెట్టే పరిస్థితి ఏర్పడుతోందని వారు అంటున్నారు. పార్టీలకు సంవత్సరాల తరబడి సేవ చేసిన సీనియర్ నాయకులు, పదవులు రాకపోయినా నిబద్ధతతో పనిచేస్తూనే ఉంటారు. కానీ కీలక సమయాల్లో వారికి గుర్తింపు దక్కకపోవడం వల్ల అసంతృప్తి పెరుగుతోంది. కొందరు పార్టీ మార్పుకు దారి తీస్తే, మరికొందరు రాజకీయాలనే వదిలిపెట్టే పరిస్థితి కూడా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో, రాజకీయాల్లో పారదర్శకత, ప్రతిభకు ప్రాధాన్యం, మరియు పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యం అవసరం అనే డిమాండ్ పెరుగుతోంది. కుటుంబ నేపథ్యం కంటే పనితీరు, ప్రజాసేవ ఆధారంగా అవకాశాలు ఇవ్వాలనే అభిప్రాయం బలపడుతోంది. మొత్తంగా చూస్తే, వారసత్వ రాజకీయాలు ఒకవైపు అనుభవాన్ని అందించగలిగినా, మరోవైపు సీనియర్ నాయకుల ఆశలను దెబ్బతీసే పరిస్థితిని సృష్టిస్తున్నాయి. ప్రజాస్వామ్యం బలపడాలంటే, ఈ రెండింటి మధ్య సమతౌల్యం అవసరం అని రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు. "రాజకీయాలు సేవకు ప్రతీకగా నిలవాలే గాని, వారసత్వానికి పరిమితం కావద్దు" అనే సందేశం ప్రస్తుతం ప్రజల్లో బలంగా వినిపిస్తోంది.

# లింగపాలెం లోస్మశాన వాటిక రోడ్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రోషన్ కుమార్



**లింగపాలెం (సిటిజన్ టైమ్స్) మార్చి 30**

లింగపాలెం లో స్మశాన వాటికకు వెళ్లే రహదారిని ఎమ్మెల్యే రోషన్ కుమార్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు రోడ్డు నిర్మాణం యొక్క ఆవశ్యకతను ఎమ్మెల్యే వివరించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోషన్ కుమార్ మాట్లాడుతూ త్వరలోనే రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు వినియోగంలోనికి తీసుకొస్తామని పేర్కొన్నారు.

# (పిజిఆర్ఎస్) ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో 44 వినతులు స్వీకరణ





**సిటిజన్ టైమ్స్,శ్రీకాకుళం, మార్చి 30**

ప్రజా ఫిర్యాదులను చట్టపరంగా పరిష్కరించాలని, ప్రజా ఫిర్యాదుల స్వీకరణ మరియు పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో అందిన ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి, వాటిని త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీస్ అధికారులను అదనపు ఎస్పీ (క్రైమ్) పి. శ్రీనివాసరావు ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ మరియు పరిష్కార కార్యక్రమంలో అదనపు ఎస్పీ 44 మంది ఫిర్యాదు దారుల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ఫిర్యాదు దారులతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకుని, పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు.ఫిర్యాదు దారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదు దారుల అర్జీలను, వారి వివరాలను సంబంధిత పోలీస్ అధికారులకు తక్షణమే ఫోన్ ద్వారా తెలియజేసి, చట్టప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఆయా ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయకుండా, తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని అధికారులను ఆదేశించారు.

# జీవో 77ను రద్దు చేసి ఫీజు రీయింబర్స్ వచ్చే విధంగా ప్రభుత్వం కృషి చేయాలి

**అమలాపురం సిటిజన్ టైమ్స్ మార్చి 30**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కలెక్టరేట్ నందు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్ ని కలిసి జీవో నెంబర్ 77ను రద్దుచేసి చదివే విద్యార్థులకు ఫీజు నెంబర్స్మెంట్ వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఈ విన్నపాన్ని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కి పంపించాలని వినతిపత్రం ఇవ్వడం జరిగింది.మోడల్ ఎంసెట్ పరీక్ష డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా ఏప్రిల్ ఒకటి నుంచి 10వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ ఉంటుంది పదవ తేదీ నుంచి 20వ తేదీ వరకు మోడల్ ఎంసెట్ ఎగ్జామ్ ఉంటుందని కలెక్టర్ కి చెప్పడం జరిగింది.మోడల్ ఎంసెట్ పోస్టర్ను డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్ చేతులమీదుగా విడుదల చేయడం జరిగింది . మోడల్ ఎంసెట్ పరీక్ష తేదీల్లో కలెక్టర్ కాళీ గా ఉంటే కచ్చితంగా మోడల్ ఎంసెట్ పరీక్షకు హాజరై విద్యార్థులకు దిశా నిర్దేశం చేస్తనని హామీ ఇవ్వడం జరిగింది.. పాత సమస్యలను కూడా పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగిందని ఒక ప్రకటనలో తెలిపారు.



# ఎస్సీ విద్యార్థుల విద్యకు 'సమగ్ర' భరోసా

- పీఎం శ్రీ పథకంలోనూ ప్రాధాన్యం -నిధుల్లో 20 శాతం ఎస్సీలకే కేటాయింపు

తెలుగు రాష్ట్రాల్లో వేల కోట్లతో విద్యా పథకాలు

ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రశ్నకు లోక్‌సభలో కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి సమాధానం

**విజయవాడ/లిన్యూఢిల్లీ (సిటిజన్ టైమ్స్) మార్చి 30**

దేశంలోని షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) విద్యార్థుల విద్యాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి తెలిపారు. 'సమగ్ర శిక్ష', 'పీఎం శ్రీ' వంటి పథకాల ద్వారా దళిత విద్యార్థుల సంక్షేమానికి భారీగా నిధులు వెచ్చిస్తోందని వివరించారు. ఎస్సీ విద్యార్థులకు విద్యాపరంగా అమలు జరుగుతున్న పథకాల వివరాలు తెలిపాలంటూ లోక్‌సభలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తో పాటుగా పలువురు ఎంపీలు సోమవారం అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖిత పూర్వక సమాధానంను కేంద్ర ప్రభుత్వం తరుపున ఇచ్చారు. ఎస్సీ విద్యార్థుల సంక్షేమం కోసం అమలవుతున్న అభివృద్ధి ప్రణాళిక (డీఏపీఎస్‌సీ) ప్రకారం.. విద్యాభివృద్ధికి కేటాయించిన మొత్తం వ్యయంలో కనీసం 20 శాతాన్ని ఎస్సీ విద్యార్థుల కోసమే ఖర్చు చేయాలని కేంద్రం స్పష్టం చేసిందన్నారు. గత కొన్నేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్సీ విద్యార్థుల నమోదు సగటున 22 శాతానికి పైగా ఉందని, అదే నిష్పత్తిలో నిధుల వ్యయం జరుగుతోందని మంత్రి వివరించారు . 2024-25 విద్యా సంవత్సరంలో దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 2.77 కోట్ల మంది ఎస్సీ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నట్లు తెలిపారు. ప్రీ-స్కూల్ నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులందరికీ సమాన విద్యావకాశాలు కల్పించడమే లక్ష్యంగా 'సమగ్ర శిక్ష' పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. జాతీయ విద్యా విధానం - 2020 లో భాగంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వంటి వెనుకబడిన వర్గాలకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ




తీసుకుంటున్నారన్నారు. సమగ్ర శిక్ష అభియాన్ నిధులు దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతలకు కలిపి 2025- 26 సంవత్సరానికి గానూ రు.46744.23 కోట్లు మంజూరు కాగా రు.18.220.96 కోట్ల నిధులు విడుదల అయ్యాయని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో అమలు విషయానికి వస్తే ఆంధ్రప్రదేశ్ కు సంబంధించి సమగ్ర శిక్ష కింద రూ. 1,732.93 కోట్లు మంజూరు కాగా, రూ. 1,240.11 కోట్లు విడుదలయ్యాయని , ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల్లో 9,93,320 మంది ఎస్సీ విద్యార్థులు ఉన్నారని వివరించారు. అదే రీతిలో తెలంగాణాలో ఈ పథకం కింద రూ. 1,162.72 కోట్లు మంజూరు చేయగా , రూ. 988.79 కోట్లు విడుదల చేశారన్నారు. తెలంగాణా రాష్ట్రంలో 6,52,066 మంది ఎస్సీ విద్యార్థులు నమోదు చేసుకున్నారని తెలిపారు.

**పీఎం శ్రీ పథకంతో నూతన వెలుగులు**

ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు 2022 సెప్టెంబరులో 'పీఎం శ్రీ' పథకాన్ని కేంద్రం ప్రారంభించిందని మంత్రి జయంత్ చౌదరి తెలిపారు. 2024-25 సంవత్సరానికి గానూ పి ఎం శ్రీ పథకం కింద దేశవ్యాప్తంగా 15.27 లక్షల మంది ఎస్సీ విద్యార్థులు లబ్ధి పొందుతున్నారన్నారు. పీఎం శ్రీ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2024-25లో కేంద్ర వాటా కింద రూ. 294.12 కోట్లు విడుదలయ్యాయని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో పీఎం శ్రీ పాఠశాలల్లో 1,52,133 మంది ఎస్సీ విద్యార్థులు చదువుకుంటున్నారని వివరించారు. రాష్ట్రాలు పంపే వార్షిక ప్రణాళికల ఆధారంగానే ప్రాజెక్ట్ అప్రూవల్ బోర్డు నిధులను మంజూరు చేస్తుందని, దీనివల్ల క్షేత్రస్థాయి అవసరాలకు అనుగుణంగా నిధుల వినియోగం జరుగుతుందని మంత్రి జయంత్ చౌదరి తెలిపారు.

## సఖినేటిపల్లి నర్సాపురం రేవు పాట ఖరారు...





**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, మార్చి 30**

సఖినేటిపల్లి మాధవాయపాలెం ఫెర్రీ 2026-27 సం.నకు రుసుము వసూలు హక్కులు పొందుటకు టెండర్ కం.బహిరంగ వేలము ను నర్సాపురం మండల ప్రజా పరిషత్ నందు నిర్వహించబడినది. పాటలో బహిరంగ వేలము నందు హెచ్చు పాటదారులైన శ్రీ విఘ్నేశ్వర శాండ్ క్వారీ ఓ బోట్స్ మెన్ లేబర్ కాంట్రాక్ట్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్, సఖినేటిపల్లి మండలం టేకిశెట్టిపాలెం వారు రూ 3,70,01,000 లకు వేలం ఖరారు చేశారు. నిబంధనలో కూడిన కలక్టర్ ఆదేశాలు ప్రకారం ఇద్దరు పాతదారులు పాల్గొనగా ఒకరిని రేవు వరించిందని, సఖినేటిపల్లి ఎం.పి.డి.ఓ. పి ఆర్సి రాజ్ కుమార్, ఎంపీపీ మల్లిబాబు, నర్సాపురం అధికారులు పాల్గొన్నట్లు తెలియజేశారు.

## రేపే క్రైస్తవ బాప్తిస్మ ప్రాంగణం ప్రారంభం...



**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, మార్చి 30**

డా బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లి బాడీ రేవులో సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు సొంత నిధులతో క్రైస్తవ బాప్తిస్మ ప్రాంగణం ఈ నిర్మాణం చేపట్టారు. రేపు ఉదయం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం కానున్నదని సర్పంచ్ చిట్టిబాబు తెలియజేశారు.

## పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చేభట్టిన ఎమ్మెల్యే దేవ...





**మలికిపురం సిటిజన్ టైమ్స్, మార్చి 30:**

అంబేడ్కర్ కోనసీమ జిల్లా, మలికిపురం మండలం శంకరగుప్తం గ్రామపంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శాసన సభ్యులు దేవ వరప్రసాద్ ప్రారంభించారు. గ్రామ అభివృద్ధి దిశగా ప్రభుత్వం చేపడుతున్న పనులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా నిర్వహించామని, మొదటగా శంకరగుప్తం చిన్న వంతెన వద్ద రూ 55 లక్షల ఆర్ అండ్ బి నిధులతో నిర్మించిన బి.టి రోడ్డును ఎమ్మెల్యే దేవ ప్రారంభించారు. కంసాలిపుంతలో (సర్పంచ్ ఇంటి వద్ద) రూ. 18 లక్షల ఇంజియరేజీస్ నిధులతో నిర్మించిన సి.సి. రోడ్డును ప్రారంభించారు. పంచాయతీ సెంటర్ వద్ద రూ. 3.80 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామపంచాయతీ ప్రవేశద్వారాన్ని ప్రారంభించారు. అలాగే మదనగోపాల స్వామి గుడి వద్ద రూ. 1 కోటి 15 లక్షల ఓఎన్జీసీ, ఆర్‌డబి నిధులతో నిర్మించిన బి.టి రోడ్డును ప్రారంభించి, ప్రజలకు అంకితం చేశారు. ఈ కార్యక్రమాల అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ రాపాక ఆనందకుమార్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. గ్రామ అభివృద్ధి కోసం మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తాను కట్టుబడి ఉన్నానని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ వంటి అభివృద్ధి పనులను కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఇంచార్జ్ గొల్లపల్లి అమూల్య, అధికారులు, ఎన్డీఏ పార్టీ నాయకులు, అధిక సంఖ్యలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ మనుగడ కోసమే వైకాపా నాయకుల పాకులాట

ఉత్తరాంధ్ర పెద్ద నాయకులమని చెప్పుకునే వారే అసత్యాలు మాట్లాడుతున్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధి తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాతే సాధ్యమైంది

రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**నిమ్మాడ (సిటిజన్ టైమ్స్) మార్చి 30**

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వైకాపా నాయకులపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఐదేళ్ల పాటు జిల్లా అభివృద్ధిని పూర్తిగా విస్మరించి ప్రజల ఆగ్రహానికి గురైన వైకాపా నాయకులు, ఇప్పుడు తిరిగి ప్రజలను మభ్యపెట్టి రాజకీయ మనుగడ కోసం అసత్య ప్రచారాలు చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. ముఖ్యంగా మూలపేట పోర్టు విషయంలో వైకాపా నాయకులు చేస్తున్న హడావిడి పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని ఆయన అన్నారు. ఏ ప్రాజెక్టు నిర్మాణ దశలో ఉన్నప్పుడు ఆ ప్రాంతాన్ని సందర్శించాలంటే ప్రభుత్వ అనుమతితో పాటు నిర్మాణ బాధ్యతలు నిర్వహిస్తున్న సంస్థ అనుమతి కూడా తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. అలాంటి అనుమతులు పొందకుండా వేలాది మందితో ప్రాజెక్టు ప్రాంతాన్ని సందర్శిస్తామని ప్రకటించడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లలో జిల్లా అభివృద్ధిపై కనీస శ్రద్ధ చూపకుండా కేవలం పదవులు కాపాడుకోవడానికే పరిమితమైందని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఇప్పుడు శరవేగంగా జరుగుతున్న మూలపేట పోర్టు నిర్మాణాన్ని మేమే 80 శాతం పూర్తి చేశామని వైకాపా నాయకులు చెప్పడం పెద్ద అబద్ధమని అన్నారు. గత 40 ఏళ్లుగా భావనపాడు ప్రాంతంలో పోర్టు నిర్మాణం కోసం తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేసిందని, కేంద్ర సంస్థలు, నిపుణుల కమిటీలు పలు అధ్యయనాలు నిర్వహించి అనుకూల పరిస్థితులు తీసుకువచ్చాయని చెప్పారు. అయితే వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూలపేట పోర్టు నిర్మాణ స్థలాన్ని మార్చి, వ్యక్తిగత ప్రయోజనాల కోసం పనులు ప్రారంభించినప్పటికీ 20 శాతం కూడా పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పోర్టు నిర్మాణ పనులను వేగవంతం చేసి దాదాపు 90 శాతం పనులు పూర్తి చేసిందని మంత్రి తెలిపారు. పోర్టుతో పాటు జాతీయ రహదారి విస్తరణ, పోర్టు వరకు ఆరు లైన్ల రహదారి నిర్మాణం, రైల్వే లైన్ అనుమతులు, రైతులను ఒప్పించి భూముల సమీకరణ వంటి కీలక కార్యక్రమాలను కూడా విజయవంతంగా చేపట్టామని చెప్పారు. ఇప్పుడు పనులు చివరి దశకు చేరుకున్న సమయంలో ప్రజల్లో తమ ప్రాధాన్యం తగ్గిపోతుందనే భయంతో వైకాపా నాయకులు మళ్లీ అసత్య ప్రచారాలకు తెరలేపుతున్నారని అచ్చెన్నాయుడు అన్నారు. ముందస్తు అనుమతులు లేకుండా వేలాది మందితో పోర్టు సందర్శన పేరుతో సభలు పెట్టి, తామే పోర్టు నిర్మాణం పూర్తి చేశామని చెప్పడం ప్రజలను మోసం చేసే ప్రయత్నమని విమర్శించారు. వాస్తవంగా పోర్టును చూడాలనుకుంటే సంబంధిత అనుమతులు తీసుకుని కొద్దిమంది ముఖ్య నాయకులు వెళ్లి పరిశీలించవచ్చని, కానీ నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టు ప్రాంతంలో వేలాది మందితోకి వెళ్లేందుకు అనుమతులు కోరడం అసంబద్ధమని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ప్రజలు ఇక వైకాపా నాయకుల నాటకీయ రాజకీయాలను నమ్మే పరిస్థితిలో లేరని ఆయన అన్నారు.

## ఘనంగా పి4 (పేదరిక నిర్మూలన నిర్మూలన) వార్షికోత్సవ కార్యక్రమం


**ఉంగుటూరు:( సిటిజన్ టైమ్స్ ): మార్చి:30:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పేద ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, ఆర్థిక అసమానతలను తొలగించడం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న స్వర్ణాంధ్ర విజన్2047 లో భాగంగా చేపట్టిన పి 4 కార్యక్రమం మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఉంగుటూరు నియోజకవర్గంలో ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. శాసనసభ్యులు లు పచ్చమట్ల ధర్మరాజు ఆధ్వర్యంలో ఆయన క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. బంగారు కుటుంబ సభ్యులతో కలిసి పేద ప్రజల అభ్యున్నతికి సహకరించిన మార్గదర్శులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పిలుపుమేరకు ముందుకు వచ్చిన పలువురు వ్యాపారవేత్తలు, ప్రముఖులు మార్గదర్శకులుగా నిలిచి పేద కుటుంబాల జీవన ప్రమాణాల మెరుగుదలకు, గ్రామాల అభివృద్ధికి అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తించారు. గత ఏడాది కాలంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రత్యేక వీడియో ద్వారా ప్రదర్శించారు. మార్గదర్శకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పి 4 కార్యక్రమం స్ఫూర్తితో ఎమ్మెల్యే మార్గదర్శకత్వంలో పేద ప్రజల అభ్యున్నతికి తమ వంతు సహకారం అందించటం ఆనందంగా ఉందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనలో భాగస్వామ్యం కావడం గర్వంగా ఉందని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారంతో,



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ నాయకత్వంలో స్వర్ణాంధ్రవిజన్ 2047 లక్ష సాధనలో భాగముగా పి 4 కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. సమాజంలో ఆర్థికస్మానుతులను తొలగించాలని సంకల్పంతో గత ఏడాది కాలంలో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేసినట్లు వెల్లడించారు. ఈ క్రమంలో కాలువల పూడిక తొలగింపు, చెరువుల పునరుద్ధరణ, పేదవారి ఇళ్లకు పూర్తిస్థాయి మరమ్మత్తులు, పాఠశాలల నిర్మాణం, తాగునీటి ప్లాంట్ల ఏర్పాటు, ప్రధానవంతు నెల మరమ్మత్తులు, పోలీస్ శాఖకు వాహనాలు అందజేత, స్మశాన వాటికల నిర్మాణం, పంచాయతీ భవనాల నిర్మాణం వంటి పలు అభివృద్ధి పనులు చేపట్టినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సీతారామలక్ష్మణ రథోత్సవం





**జిల్లా స్టాఫ్ రిపోర్టర్ వాల్మీకిపురం మార్చి 30. సిటిజన్ టైమ్స్**

అన్నమయ్య మదనపల్లి జిల్లా వాల్మీకిపురంలో గత వారం రోజులుగా జరుగుతున్న శ్రీ పట్టాభిరాముల బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి తిరుమల తిరుపతి దేవస్థానం వారిచే శ్రీ సీతారాముల కళ్యాణం వైభవంగా జరిగింది. కళ్యాణ మహోత్సవమునకు పీలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రములు సమర్పించి వేద పండితులతో ఆశీర్వాదములు పొంది తీర్థ ప్రసాదాలు పుచ్చుకున్నారు. తదుపరి గరుడ వాహనంపై సీతారామ లక్ష్మణుల ఊరేగింపు అశేష జన సందోహము మధ్య వైభవంగా జరిగింది. సోమవారం ఉదయం శ్రీ సీతారామ లక్ష్మణులను రథంపై అధిరోహింపజేసి పట్టణములోని నాలుగు మాడవీధులలో రథోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వాల్మీకిపురం భక్తజన సందోహముతో నిండి పోయింది.

# జిల్లాలో పేదరిక నిర్మూలనే పి4 లక్ష్యం

## కలెక్టర్ మహేష్ కుమార్ ఎమ్మెల్యే ఆనందరావు






29,30

అమలాపురం, మార్చి 30

స్వర్ణాంధ్ర 2047లో భాగంగా పి--4 సర్వే (జీరో పావర్టీ) కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధనలో భాగంగా 10 ముఖ్య సూత్రాలలో ఒకటైన పి--4 సర్వే (జీరో పావర్టీ) కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. "మార్గదర్శి కుటుంబం 10--20" లక్ష్యంతో అమలు చేస్తున్న ఈ కార్యక్రమం ద్వారా నిరుపేద కుటుంబాలను గుర్తించి, వారిని ఆర్థికంగా స్వావలంబన దిశగా తీసుకెళ్లడం ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పేదరిక నిర్మూలన అనేది కేవలం ఆర్థిక సహాయం అందించడం ద్వారా సాధ్యంకాదని, కుటుంబాల జీవన విధానంలో స్థిరమైన మార్పు తీసుకురావడం ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని పేర్కొన్నారు.అందుకోసం ప్రతి కుటుంబం యొక్క సామాజిక, ఆర్థిక పరిస్థితులను సమగ్రంగా విశ్లేషించి, వారికి తగిన విధంగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రతి మార్గదర్శి తనకు కేటాయించిన 10 నుండి 20 కుటుంబాల అభివృద్ధికి బాధ్యత వహిస్తూ, వారి జీవన ప్రమాణాలలో స్పష్టమైన మార్పు తీసుకురావాల్సి ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. కుటుంబాల ఆదాయ వనరులను పెంపొందించడం, మహిళల ఆర్థిక సాధికారతను ప్రోత్సహించడం, యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందించడం, పిల్లలకు నాణ్యమైన విద్య అందేలా చూడడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లాలో గ్రామ సభల ద్వారా సుమారు 60,000 బంగారు కుటుంబాలను గుర్తించారు. ప్రతి గ్రామంలో సగటున 4 నుండి 5 కుటుంబాలు ఉన్నట్లు నిర్ధారించారు.ఈ కుటుంబాలకు నిరంతర మార్గదర్శకత్వం అందించేందుకు మొత్తం 2,925 మంది మార్గదర్శులను ఎంపిక చేసి, వారిని సంబంధిత కుటుంబాలకు అనుసంధానం చేశారు. ఈ ప్రక్రియలో గ్రామస్థాయి ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ పారదర్శకతను కల్పించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం అమలులో ప్రభుత్వ శాఖలతో పాటు ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యం కూడా కీలకంగా మారింది. ఓఎన్జీసీ (కాకినాడ, రాజమండ్రి), గెయిల్ (కాకినాడ), వేదాంత సెజ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ వంటి సంస్థలు తమ సామాజిక బాధ్యత కార్యక్రమాల ద్వారా సహకారం అందిస్తున్నాయి. మండల స్థాయిలో నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల విస్తరణ, మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. అదనంగా, 2026 ఏప్రిల్ నుండి 2027 మార్చి వరకు జిల్లాకు రూ.1,64,188.45 కోట్ల భారీ బడ్జెట్ కేటాయించబడింది.ఈ నిధులను సమర్థవంతంగా వినియోగించి పేదరిక నిర్మూలన, గ్రామీణాభివృద్ధి, ఉపాధి సృష్టి,మౌలిక వసతుల అభివృద్ధి వంటి రంగాల్లో విస్తృత కార్యక్రమాలు అమలు చేయనున్నారు. పి--4 సర్వే (జీరో పావర్టీ) కార్యక్రమం ద్వారా గుర్తించిన ప్రతి కుటుంబాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లి, జిల్లాను పేదరిక రహిత జిల్లాగా మార్చడం తమ ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధనలో ఈ కార్యక్రమం కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ, జిల్లాలో ఉపాధి అవకాశాలను విస్తరించేందుకు పరిశ్రమల స్థాపనపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. తన పదవీకాలం పూర్తయ్యేలోపు కనీసం 100 మందికి ఉపాధి కల్పించే విధంగా ఒక పరిశ్రమను స్థాపించనున్నట్లు హామీ ఇచ్చారు. యువత స్వయం ఉపాధి దిశగా ముందుకు రావాలని సూచించారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా బలపడేందుకు పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలని,ఆర్గానిక్ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, రోజువారీ అవసరాలకు కావాల్సిన కూరగాయలను స్వయంగా పండించుకోవాలని సూచించారు. స్థానిక వనరులను సమర్థవంతంగా వినియోగించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయవచ్చని పేర్కొన్నారు.స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమంలో భాగంగా పి--4 సర్వే (జీరో పావర్టీ) అమలులో విశిష్టంగా సేవలందిస్తున్న మార్గదర్శకులను సన్మానించారు. విశిష్ట మార్గదర్శకులైన దేవిశెట్టి శ్రీనివాస్ రావు (డీటీఓ), ఓఎన్జీసీ కాకినాడ, రాజమండ్రి, గెయిల్ కాకినాడ, వేదాంత ఇండస్ట్రీస్ ప్రతినిధులను స్థానిక ఎమ్మెల్యే ,జిల్లా కలెక్టర్ ఘనంగా సత్కరించారు. అదేవిధంగా నియోజకవర్గ స్థాయిలో కూడా మార్గదర్శకులను ప్రత్యేకంగా సన్మానించారు.వారికి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి, స్మారక చిహ్నాలు ప్రదానం చేసి వారి సేవలను ప్రశంసించారు. సమాజాభివృద్ధిలో వారి పాత్ర కీలకమని పేర్కొంటూ, భవిష్యత్తులో ఇదే ఉత్సాహంతో సేవలు కొనసాగించాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఎం. మురళి కృష్ణ, అమలాపురం నియోజకవర్గం స్పెషల్ ఆఫీసర్ డి. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**ప్రజలు ఇచ్చిన అర్జీలకు తక్షణ పరిష్కారం చూపండి.**

**పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి.**



**పుట్టపర్తి (సిటిజన్ టైమ్స్) మార్చి 30**

ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథరెడ్డి లో నియోజకవర్గ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అర్జీల ద్వారా అధికారులకు అందిన వెంటనే తక్షణం వాటికి పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి నియోజవర్గ అధికారులకు సూచించారు. అర్జీలు ఇచ్చిన వాటిని గాలికి పడేయకుండా సమస్యను ప్రాధాన్యతగా తీసుకొని తక్షణం పరిష్కారం చూపాలని లేనిపక్షంలో అలాంటి అధికారులపై శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా గ్రామాల్లో త్రాగునీటి ఎద్దడి రాకుండా స్థానిక పంచాయతీ అధికారులు ఆర్డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో సమస్య పరిష్కారానికి పరిష్కారం చూపాలని కోరారు. గ్రామాల్లో విద్యుత్ సమస్య తలెత్తకుండా సంబంధిత అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. త్రాగునీటి కి ఇబ్బంది లేకుండా గ్రామాల్లో నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన ప్రజలు స్థానిక ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పి 4 తొలి వార్షికోత్సవం

**విజన్ 2047 మార్గదర్శకులకు అభినందనలు**

**రాజులు ఎమ్మెల్యే వరప్రసాద్**



**రాజోలు సిటిజన్ టైమ్స్ మార్చి 30**

రాష్ట్ర అభివృద్ధి, పేదరిక నిర్మూలన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పి 4 కార్యక్రమం పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ ఆర్ట్ వర్క్ తొలి వార్షికోత్సవం సందర్భంగా రాజోలు నియోజకవర్గంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం లక్కవరం ఎంజీ గార్డెన్స్ లో జరిగింది. సమావేశానికి నియోజకవర్గ ప్రత్యేక అధికారి జి. మమ్మీ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన విజన్--2047 లక్ష్యాలను వివరించారు. రాష్ట్ర స్థూల ఆదాయం మరియు తలసరి ఆదాయాన్ని గణనీయంగా పెంచి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లడం ఈ విజన్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. రాష్ట్రంలో సముద్ర తీరం, వ్యవసాయం, ఐటీ రంగం, పరిశ్రమలు, యువత ప్రతిభ వంటి వనరులను సమర్థంగా వినియోగిస్తే రాష్ట్ర ఆర్థికాభివృద్ధి వేగంగా జరుగుతుందని అన్నారు. అభివృద్ధి పెరిగే కొద్దీ సంపన్నులు--పేదల మధ్య తేడా ఉండేందుకు 4 కార్యక్రమం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ఉన్న మార్గదర్శకులు సమాజంలో వెనుకబడిన కుటుంబాలకు మార్గనిర్దేశం చేసి, విద్య, ఉపాధి, ప్రభుత్వ పథకాల గురించి గైడెన్స్ ఇవ్వడం ద్వారా వారిని అభివృద్ధి దిశగా తీసుకెళ్లడం లక్ష్యమని అన్నారు. ఇది కేవలం డబ్బు సహాయం కాకుండా హ్యాండ్ హోల్డింగ్ మరియు మార్గదర్శనం ద్వారా పేద కుటుంబాలను ముందుకు తీసుకురావడం ప్రధాన ఉద్దేశమని వివరించారు. సమాజ సేవలో ముందుండి సహకరిస్తున్న పలువురు మార్గదర్శకులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశంసా పత్రాలు అందజేసి సత్కరించారు. సమాజంలో సేవా భావంతో పనిచేస్తున్న వ్యక్తులకు గుర్తింపు ఇవ్వడం ద్వారా మరింత మంది ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో రోడ్లు, త్రాగునీటి సరఫరా, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి ఇంటికి కళాయి ద్వారా త్రాగునీరు అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, మార్గదర్శకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లి నియోజకవర్గం గోపినగర్‌లో ఉత్సాహంగా జిల్లా స్థాయి కుస్తీ పోటీలు...

## రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు 18 మంది ఎంపిక...



**శేరిలింగంపల్లి, సిటిజన్ టైమ్స్, మర్చి 30**

రంగారెడ్డి జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ నేతృత్వంలో జిల్లా స్థాయి అండర్ 20 పురుషులు, మహిళల కుస్తీ పోటీలు ఘనంగా జరిగాయి. తుల్జాభవాని వ్యాయామశాల ఆధ్వర్యంలో గోపినగర్ ప్రధాన కూడలిలో సోమవారం జరిగిన ఈ పోటీలలో జిల్లాలోని వివిధ వ్యాయామశాలల నుంచి దాదాపు 100 మంది క్రీడాకారులు పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఫ్రీ స్టైల్ వివిధ కేజీల విభాగంలో అభినయ్, శ్రీధర్, భరత్ బాబు, నాగేందర్, ఉమేష్, పియూష్ సింగ్, అభిషేక్, జయ కిషన్ యాదవ్, సోమనాథ్ రెడ్డి, మహిళలు అపూర్వ, లక్ష్మి, శ్రీనిధి, రోమన్ గ్రీక్ స్టైల్ విభాగంలో వివిధ కేజీల పోటీల్లో శివకుమార్, ప్రణవ్ కుమార్, సాంబా ధనుంజయ్, సందీప్ చరణ్, సంపత్ కుమార్, దీప్ సింగ్, రవి కిరణ్, అభిరామ్ రెడ్డిలు మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. మీరందరూ ఏప్రిల్ 2వ తేదీ కామారెడ్డి లో జరగనున్న స్థాయి రెజ్లింగ్ పోటీలకు అర్హత సాధించారు. విజేతలకు ముఖ్య అతిథులుగా పాల్గొన్న పిసిసి ప్రధాన కార్యదర్శి శేరిలింగంపల్లి ఇన్చార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్, బిఆర్ఎస్ శేరిలింగంపల్లి ఉమ్మడి డివిజన్ ఇంచార్జ్ రవికుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్ అశోక్ గౌడ్, మాజి కౌన్సిలర్ దొంతి లక్ష్మీనారాయణ గౌడ్, నాయకులు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి, మూల వెంకటేష్ గౌడ్, దుర్గం వీరేశం గౌడ్, విజయ్ కుమార్ రెడ్డి, కాటా నరసింహ గౌడ్, కొమరగొని వెంకటేష్ గౌడ్, పుట్ట వినయ కుమార్ గౌడ్, బెజగం కేశవులు, లీలానంద్ గౌడ్, గోపాల్ యాదవ్, కలివేముల వీరేశం గౌడ్, పుట్ట శ్రీకాంత్ గౌడ్, గఫూర్, పవన్ గౌడ్, నర్సింహా తదితరులు పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ.. కుస్తీ అంటే భారతీయ ప్రాచీన మల్ల యుద్ధమని, ఒలంపిక్స్ లోను ప్రాధాన్యతను సంతరించుకున్న అన్నారు. అలాంటి కుస్తీ వైపు యువత అడుగు లు వేయడం అభినందనీయమని అన్నారు. లింగంపల్లిలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించిన తుల్జా భవాని వ్యాయామశాల నిర్వాహకులు లచ్చుమొళ్ల పాండు గౌడ్, వారి కుమారులు అరవింద్ గౌడ్, మోహన్ గౌడ్, రోషన్ గౌడ్ లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కే.యాదయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.పాండు, ఉపాధ్యక్షులు హీరలాల్, కార్యదర్శి భగవాన్ సింగ్, కుస్తీ ప్రముఖులు రాజు, శ్రీధర్, రాజ్ కుమార్, సుధాకర్, రమ్య, శ్రీనివాస్, విశ్వంభర్ సింగ్, నవీన్, ప్రకాష్ సింగ్ బస్తీవాసులు సంఖ్యలో పాల్గొన్నారు.

# అంతర్వేది నృసింహుని హుండీ లెక్కింపు....



**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, మార్చి30**

అంబేడ్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానము నందు హుండీలు తెరచి లెక్కించగా 53 రోజులకు ప్రధాన ఆలయ హుండిల ద్వారా రూ 35,93,457లు, గుర్రలక్క శ్రీ అమ్మవారి హుండీ రూ 27,872 లు, అన్నదానం హుండిల ద్వారా రూ. 87,009 లు కలిపి మొత్తం రూ 37,08,338లు ఆదాయం వచ్చియున్నది. దేవదాయశాఖ అమలాపురం తనిఖీదారు జె రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో ఎంపిటిసి బైరా నాగరాజు, సర్పంచ్ కొండా జాన్ బాబు సమక్షములో ఆలయ సిబ్బంది హుండీలు తెరచి లెక్కించుటమైనది. పలు దేశాల విదేశీ కరెన్సీ వచ్చియున్నదని అసిస్టెంట్ కమిషనర్ మోకా నాగవర ప్రసాద్ తెలియజేశారు.

# కూటమి పాలనలో పేదల సొంతింటి కల సాకారం

**లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందజేసిన జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఎమ్మెల్యే కోణతాల రామకృష్ణ**





**అనకాపల్లి (సిటిజన్ టైమ్స్ ) మార్చి 30:**

పేదలకు సొంతింటి కల సాకారం చేయాలనే సంకల్పంతో మన ఇల్లు మన గౌరవం నినాదంతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా అనకాపల్లి మండలం మారేడు పూడి గ్రామం లో రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ద్వారా చేపట్టిన ఇళ్లను సోమవారం అనకాపల్లి ఎమ్మెల్యే కోణతాల రామకృష్ణ, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు ల తో కలిసి జిల్లా కలెక్టర్ విజయ్ క్రిష్ణన్ గృహ యజమానులకు తాళాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతు ఈ ఇల్లు పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాదిగా, కుటుంబాన్ని భద్రతగా ఉండాలని, జీవితంలో ఆనందం ఆత్మ విశ్వాసం అభివృద్ధి తీసుకురావాలని ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా 2,50,893 లక్షల ఇళ్లను, అనకాపల్లి జిల్లాలో రూ.42.41 కోట్లతో 10,414 ఇళ్లను, నియోజకవర్గంలో రూ.16.55 కోట్లతో 1868 పూర్తి చేసి, పేదలను ఇంటి యజమానులను చేశామన్నారు. అతి త్వరలోనే ఈ ప్రాంతానికి మంచినీటి సదుపాయాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కోణతాల రామకృష్ణ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో సొంతింటి కలను సాకారం చేసుకున్న లబ్దిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని ప్రణాళిక బద్ధంగా ఇళ్ల నిర్మాణాలను ఇచ్చిన మాట ప్రకారం 20 నెలల వ్యవధిలో పూర్తి చేసి అందజేసిదన్నారు. కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణ సంస్థ పి డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీష్, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, సిహెచ్ఎన్ అగ్రహారం పిఏసిఎస్ చైర్మన్ బంటు రవి, ఎంపీటీసీ చదర నాగేశ్వరావు, ప్రజలు మహిళలు పాల్గొన్నారు.

# అల్లూరి జిల్లా కలెక్టర్‌గా పదోన్నతి పొందిన టి.నిశాంతి కి ఎమ్మెల్యే ఆనందరావు ప్రముఖుల ఘన సత్కారం

**అల్లూరి జిల్లా కలెక్టర్‌గా పదోన్నతి పొందిన టి.నిశాంతి కి అభినందనల జల్లు**

**అమలాపురం, సిటిజన్ టైమ్స్ మార్చి 30**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా సమర్థవంతమైన సేవలు అందించిన టి.నిశాంతి అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా పలువురు ప్రముఖులు ఆమెను కలిసి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు నేడు జాయింట్ కలెక్టర్ ని స్వయంగా కలిసి, ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అభివృద్ధిలో ఆమె చూపిన చొరవను ఎమ్మెల్యే ఈ సందర్భంగా కొనియాడారు. కొత్తగా బాధ్యతలు చేపట్టబోతున్న అల్లూరి సీతారామరాజు జిల్లాలో కూడా ఆమె తనదైన ముద్ర వేయాలని, ఆ ప్రాంతాభివృద్ధికి మరింత కృషి చేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి , మార్కెట్ కమిటీ చైర్మన్ అధికారి జయ వెంకటలక్ష్మి, ఎమ్మెల్యే తనయుడు యువ నాయకులు రత్నాకరణ్ టి. నిశాంతిని కలిసి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. మరియు స్థానిక నేతలు కార్యకర్తలు పాల్గొని ఆమెకు వీడ్కోలు పలికారు.



# పోలీసుల వ్యూహం సక్సెస్...

# 36 ఏళ్ల మావోయిస్టు నేత లొంగుబాటు

## 36 ఏళ్ల మావోయిస్టు కార్యకలాపాలకు ముగింపు







**సిటిజన్ టైమ్స్, మార్చి 30 అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో ఎడమచేతి తీవ్రవాదం (ఎల్‌డబ్ల్యుఈ) నియంత్రణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆంధ్ర ఒడిశా సరిహద్దు ప్రత్యేక జోనల్ కమిటీ ఏఓబిఎస్ జెడ్ సి కార్యదర్శిగా వ్యవహరించిన సీనియర్ మావోయిస్టు నాయకుడు చెల్లూరి నారాయణరావు అలియాస్ సురేష్ సిసిఎం పాటు గా ఈ రోజు రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఐపీఎస్ సమక్షంలో మరో ఎనిమిది మంది కేడర్లతో కలిసి లొంగిపోయారు. మావోయిస్టు ఉద్యమంలో సుమారు 36 సంవత్సరాల పాటు కీలక పాత్ర పోషించిన ఆయన లొంగిపోవడం, రాష్ట్రంలో మావోయిస్టు కార్యకలాపాలపై నియంత్రణ సాధనలో ఒక ప్రధాన మైలురాయిగా అధికారులు భావిస్తున్నారు. నిఘా సమాచారంతో ముందస్తుగా చేపట్టిన ఆపరేషన్లలో భాగంగా పోలీసు బృందాలు మొత్తం 19 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి. ఇందులో ఒక ఐ ఎన్ ఎస్ ఏ ఎస్ రైఫిల్, రెండు బీజీఎల్‌లు, మూడు .303 రైఫిళ్లు, నాలుగు ఎస్ బి బి ఎల్ తుపాకులు మరియు ఇతర ఆయుధ సామగ్రి ఉన్నాయి. గత ఏడాది కాలంగా ఆంధ్రప్రదేశ్ పోలీసులు అమలు చేస్తున్న వ్యూహాత్మక చర్యల ఫలితంగా మావోయిస్టు కార్యకలాపాలపై గణనీయమైన నియంత్రణ సాధ్యమైందని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో అనేక ఆయుధ నిల్వలను వెలికితీసి, ఆయుధాలు, మందుగుండు సామగ్రి, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ల విజయానికి స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ ఎస్ఐబి, గ్రేహౌండ్స్ బలగాల కృషి కీలకమని డీజీపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీజీపీ (లా అండ్ ఆర్డర్) మధుసూదన రెడ్డి, ఐపీఎస్, అదనపు డీజీపీ (ఇంటెలిజెన్స్) మహేష్ చంద్ర లద్దా, ఐపీఎస్ సహా ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే పేదల సొంతింటి కల సాకారం

**- ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు**

**మోదీ విజన్.. చంద్రబాబు అభివృద్ధి.. పవన్ కళ్యాణ్ అండ**

**కూటమి ప్రభుత్వంలో సామాన్యుడికి సొంతిల్లు -ఎమ్మెల్యే**



**ఆనందరావు అమలాపురం, సిటిజన్ టైమ్స్ మార్చి 30**

ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న 2.50 లక్షల గృహప్రవేశ మహోత్సవాల సందర్భంగా, అమలాపురం పట్టణం 30వ వార్డులో జరిగిన గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇంట పూజా కార్యక్రమాల్లో పాల్గొని, వారికి నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. "పేదల సొంతింటి కల సాకారం కావడమే మన కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ప్రపంచ దేశాలు గర్వించేలా అద్భుత పాలన అందిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, అభివృద్ధికి నిలువుటద్దం మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ప్రజల పక్షాన నిలబడే పోరాట యోధుడు పవన్ కళ్యాణ్ .. ఈ ముగ్గురు నేతల త్రివేణి సంగమమే నేడు ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పాలనకు పునాది" అని కొనియాడారు. ముఖ్యంగా చంద్రబాబు నాయుడు విజన్ తో అమరావతి నిర్మాణం ఎంత ముఖ్యమో, ప్రతి పేదవాడికి సొంతిల్లు ఉండటం కూడా అంతే ముఖ్యమని భావించి ఈ పథకాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని తెలిపారు. పవన్ కళ్యాణ్ పట్టుదల, మోదీ అండదండలతో అమలాపురం నియోజకవర్గంలోని ప్రతి అర్హుడికి పక్కా గృహం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వ హయాంలో అవినీతికి తావులేకుండా పారదర్శకంగా లబ్ధిదారులకు మేలు జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, వార్డు ప్రతినిధులు భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ఫోన్ ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకున్న కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం సిటిజన్ టైమ్స్ మార్చి 30**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్( పి జి ఆర్ ఎస్ )ద్వారా ప్రజల నుండి అందిన ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ, హెచ్‌సీఎం ఎండోర్స్‌మెంట్ ద్వారా వచ్చిన అర్జీలలో పరిష్కరించబడిన వాటిపై జిల్లా పరిపాలన ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఈ సందర్భంగా,జిల్లా కలెక్టర్ డా.ఆర్.మహేష్ కుమార్ కలెక్టర్ కార్యాలయం నుండి అర్జీదారులతో నేరుగా ఫోన్ ద్వారా మాట్లాడి, సమస్యల పరిష్కారంపై వారి స్పందనను తెలుసుకున్నారు. సఖినేటిపల్లి మండలానికి చెందిన పి.నరేంద్ర సమర్పించిన ఫిర్యాదు రెవెన్యూ శాఖ ఉద్యోగిపై సంబంధించినది. సంబంధిత అధికారుల ద్వారా విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకోవడంతో సమస్య పరిష్కరించబడింది. ఈ సందర్భంగా కలెక్టర్ అర్జీదారుతో మాట్లాడగా, సమస్యకు సముచిత పరిష్కారం లభించిందని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కొత్తపేట మండలానికి చెందిన రెడ్డి సుబ్రహ్మణ్యం సమర్పించిన అర్జీ రెవెన్యూ కోర్టు ఉత్తర్వుల అమలుకు సంబంధించి,సంబంధిత విభాగం చర్యలు తీసుకుని కోర్టు ఆదేశాలను అమలు చేయడంతో సమస్య పరిష్కరించబడింది. కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడగా, తాను ఎదుర్కొన్న సమస్యకు త్వరితగతిన పరిష్కారం లభించిందని అర్జీదారు తెలిపారు. అమలాపురం మండలానికి చెందిన యనమడల మంగాయమ్మ సమర్పించిన ఫిర్యాదు గృహ నిర్మాణ పథకంలో ఇప్పటికే మంజూరైన ఇల్లు లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి, సంబంధిత శాఖ అర్జీని పునఃసమీక్షించి సమస్యను పరిష్కరించింది. ఈ విషయంపై కలెక్టర్ మాట్లాడగా, తన సమస్యకు పరిష్కారం లభించిందని ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. ఆర్.మహేష్ కుమార్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి అర్జీపై సమగ్రంగా విచారణ జరిపి పారదర్శకంగా పరిష్కారం అందించేందుకు అధికారులు కట్టుబడి ఉన్నారని తెలిపారు. పిజి ఆర్ఎస్ వేదిక ద్వారా ప్రజలు తమ సమస్యలను నమోదు చేయాలని సూచించారు.

## 2047కు పేదరికం లేని సమాజం నిర్మించడమే ధ్యేయం...

**ప్రతీ కుటుంబం ఎదగాలి, ప్రతీ గ్రామం అభివృద్ధి చెందాలి అనేదే పీ4 లక్ష్యం...**

**కొత్తపేట కాపు కళ్యాణ మండపంలో జరిగిన పీ4 ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు...**



**కొత్తపేట సిటిజన్ టైమ్స్ మార్చి 30**

విజన్ 2047 వ సంవత్సరానికి మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్ళు పూర్తవుతున్న సమయానికి పేదరికం లేని సమాజం నిర్మించడమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పీ4 కార్యక్రమాన్ని చేపట్టినట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. సోమవారం కొత్తపేట కాపు కళ్యాణ మండపంలో జరిగిన పీ4 ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన నియోజకవర్గ ప్రత్యేక అధికారి రాజేశ్వరరావు, ఆకుల రామకృష్ణ, 4 మండలాల ఎంపీడీఓలు పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ధనికులు, పేదల అభివృద్ధికి కృషి చేయాలనేదే పీ4 లక్ష్యం అన్నారు.ప్రతి కుటుంబం ఎదగాలి,ప్రతి యువకుడికి అవకాశాలు రావాలి,ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలనేదే స్వర్ణ ఆంధ్ర విజన్ 2047 ఉద్దేశమన్నారు.ఆర్థికంగా స్థిరపడిన వారు మార్గదర్శులుగా, ఆర్థికంగా బలహీనమైన కుటుంబాలు బంగారు కుటుంబాలుగా ఈ కార్యక్రమంలో ఉంటాయన్నారు.పీ4 అంటే ఆర్థిక సాయం మాత్రమే కాదని ఒక కుటుంబాన్ని దత్తత తీసుకోవచ్చని, ఒక గ్రామాన్ని అభివృద్ధి చేయవచ్చని,లేదా నైపుణ్య శిక్షణ ఇప్పించి ఉద్యోగ కల్పన చేయవచ్చని లేదా మరో రూపంలో సాయం అందించవచ్చన్నారు. గత ఒక సంవత్సరం కాలంలో కొత్తపేట నియోజకవర్గంలో పి4 కార్యక్రమం ద్వారా 8,629 బంగారు కుటుంబాలు నమోదు అయ్యాయన్నారు. ఇప్పటికే 1,995 కుటుంబాలను మార్గదర్శకులు దత్తత తీసుకున్నార న్నారు. మార్గదర్శకులు అందర్నీ హృదయపూర్వకంగా అభినందిస్తున్నాన న్నారు. ఇప్పటివరకు మొత్తం 372 మంది మార్గదర్శకులు ముందుకు వచ్చి సమాజ సేవలో భాగస్వాములు అయ్యారని కొనియాడారు. మరింత పూర్తి స్థాయిలో ఈ కార్యక్రమం ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఆత్రేయపురం మండలానికి చెందిన ఇద్దరు పీ4 మార్గదర్శకులు అల్లం వరప్రసాద్, కుసుంపూడి రామరాజులను సత్కరించి ప్రశంసాపత్రాలను అందజేశారు. వారు చేస్తున్న సేవలను కొనియాడారు.కార్యక్రమంలో భాగంగా వానపల్లికి చెందిన డివిఆర్ స్కూల్ అధినేత,డి.వెంకటేశ్వరరావు,తాజా ఉద్యోగ క్యాలెండర్ నేపథ్యంలో పలువురు నిరుద్యోగులకు కోచింగ్ కోసం సహాయం అందించనున్నట్లు ప్రకటించారు. కట్టుంగ గ్రామానికి చెందిన కరుటూరి నాగేంద్ర గ్రామానికి చెందిన మక బేబీ కి రూ.5 వేలు,అంకంపాలెం గ్రామానికి చెందిన కుడప కృష్ణయ్య గ్రామానికి చెందిన మట్టా దానయ్య కి రూ.5వేలు,వెలిచేరు గ్రామానికి చెందిన రాగిరెడ్డి సత్యనారాయణ అదే గ్రామానికి చెందిన సాలిశెట్టి కృష్ణవేణి రూ. 5వేలు, గూడెయ్ ఛారిటబుల్ ట్రస్ట్ వారు వాడపాలెంకు చెందిన ఆదిలక్ష్మి (ఒంటరి మహిళ) కి నెలకు రూ. 2,000/చొప్పున సహాయం అందించారు. ఎమ్మెల్యే ఈ సందర్భంగా మార్గదర్శులను ప్రశంసించారు.అనంతరం పీ4 వార్షికోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్న లైవ్ కార్యక్రమాన్ని అందరితో కలసి వీక్షించారు.

## ముమ్మిడివరం నియోజకవర్గంలో స్వర్ణాంధ్ర 2047 - జీరో పావర్టీ 4 అనివర్సరీ కార్యక్రమం




**ముమ్మిడివరం సిటిజన్ టైమ్స్ మార్చి 30**

నియోజకవర్గంలో స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంతో నిర్వహించిన జీరో పావర్టీ (4) అనివర్సరీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో గౌరవ ప్రభుత్వ విప్ ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) పాల్గొన్నారు. ఈ సందర్భంగా దత్తత తీసుకున్న బంగారు కుటుంబాలతో ఆయన స్నేహపూర్వకంగా ఇంటరాక్ట్ అయ్యి, వారి అభివృద్ధి, జీవన స్థితిగతులను తెలుసుకున్నారు. కార్యక్రమంలో శాసనసభ్యులు వారు మాట్లాడుతూ "2047 నాటికి రాష్ట్రంలో ఆర్థిక అసమానతలను పూర్తిగా తొలగించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో విజన్ 2047 అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా బలపడేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు" మార్గదర్శకుల సేవలను ప్రశంసిస్తూ, సమాజం పట్ల మానవతా దృక్పథంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాల్లో భాగంగా ముందుండి పనిచేస్తున్న మంతెన వెంకట రామ రాజు శ్రీనివాస్ పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ప్రతినిధులను సన్మానించారు. ఈ కార్యక్రమం కూటమి సీనియర్ నేతలు కార్యకర్తలు అధికారులు ప్రజలు మీడియా మిత్రులు పాల్గొన్నారు.

# ఆర్థిక అసమానతలు లేని సమాజం కోసం ముందుకు రావాలి

### రామచంద్రపురంలో వేడుకలా పి4 ప్రథమ వార్షికోత్సవం -బంగారు కుటుంబాలు - మార్గదర్శకుల స్థాయికి ఎదగాలి

### పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పి4 కార్యక్రమం- మంత్రి సుభాష్

### చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా పి4 - సామాజిక మార్పుకు నాంది

### సమాజంలో సమానత్వం కోసం పి4 ఉద్యమం -మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపు

**రామచంద్రపురం, సిటిజన్ టైమ్స్ మార్చి 30**

రాష్ట్రంలో ఆర్థిక అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. రామచంద్రపురంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పి4 బంగారు కుటుంబం ప్రథమ వార్షికోత్సవం వేడుక వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదరిక నిర్మూలన లక్ష్యంగా పి4 కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. సమాజంలో దిగువ స్థాయిలో ఉన్న కుటుంబాలను "బంగారు కుటుంబాలు"గా, ఎగువ స్థాయిలో ఉన్నవారిని "మార్గదర్శకులు"గా గుర్తించి, బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని వారికి సామాజిక, ఆర్థిక భరోసా కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో ఇప్పటికే 11,308 బంగారు కుటుంబాలలో 7,309 బంగారు కుటుంబాలను 1068 మార్గదర్శకులు దత్తత తీసుకున్నారని మంత్రి వెల్లడించారు. పేదరికం లేని సమాజం నిర్మాణం కోసం అందరి సహకారం అవసరమని పిలుపునిచ్చారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా రూ. 4,29,000 వ్యయంతో శ్రీ భీమేశ్వర స్వామి మోటార్ సైకిల్ మెకానిక్ వర్కర్స్ యూనియన్‌కు బిఎస్-6 సాంకేతికతపై శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు.కిక్ బాక్సింగ్‌లో ప్రతిభ కనబరుస్తున్న నిరుపేద విద్యార్థిని కారుమూరి లేఖ నిహారికను దత్తత తీసుకుని రూ.1.30 లక్షల ఆర్థిక సహాయం అందించడం ద్వారా అండగా నిలిచారని ప్రశంసించారు. అలాగే ఫౌండేషన్ ద్వారా 127 మంది నిరుపేద విద్యార్థులను దత్తత తీసుకుని చదివిస్తూ సీఎం చంద్రబాబు ఆశయాలను సాకారం చేస్తున్నారని కొనియాడారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ పి4 కార్యక్రమం లక్షలాది కుటుంబాలకు భరోసా కల్పిస్తుందని తెలిపారు. తమ ఫౌండేషన్ ద్వారా భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి సీఎం చంద్రబాబు ఆశయ సాధనలో పాలు పంచుకుంటామన్నారు. ఏ ఎం సి చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ మాట్లాడుతూ సమాజంలో ఆర్థిక అసమానతలు లేకుండా చేస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఉన్నత ఆశయంతో సీఎం చంద్రబాబు పి4 కార్యక్రమంకు శ్రీకారం చుట్టారన్నారు.




**మార్గదర్శకులకు సత్కారం..:** సీఎం చంద్రబాబు పిలుపుతో బంగారు కుటుంబాలకు అండగా నిలిచిన మార్గదర్శకులు ఎన్ వసంత హరిణి, నేమాని సత్యనారాయణ, నేమాని హరికృష్ణలను మంత్రి సుభాష్ ఘనంగా సత్కరించారు.

కాజులూరు మండలం జగన్నాథగిరి గ్రామంలో పేద కుటుంబాన్ని దత్తత తీసుకుని రూ. 3.40 లక్షల ఆర్థిక సహాయం అందించిన వసంత హరిణిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.అనాధ పిల్లల కోసం ఆశ్రమం నిర్మిస్తున్న ఆశ కుమార్, సంతోష్ కిరణ్‌లను కూడా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి విజయలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, మున్సిపల్ కమిషనర్ కెవిఆర్9 రాజు, ఎంపీడీవోలు పద్మజ్యోతి, శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్లు రెడ్డి శేషగిరిరావు, ఖండవల్లి శ్రీనివాసరావు, వల్లు అర్జున్, మేకల లక్ష్మి, మార్గదర్శకులు, బంగారు కుటుంబాలు పాల్గొన్నారు. సీవీ ఏపీ యూనిట్ యంగ్ ప్రొఫెషనల్ ఏ హరికృష్ణ మరియు టీమ్ సభ్యులను మంత్రి ఈ సందర్భంగా అభినందించారు.

**గరికపాటి సూర్యనారాయణకు మంత్రి సన్మానం**

తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త గరికపాటి సూర్యనారాయణ ను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం లు ఘనంగా సత్కరించారు. తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ వేడుకలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా గరికపాటి సూర్యనారాయణ ను అమరావతి పిలిపించి ఆత్మీయ విందు ఇచ్చి సత్కరించడం, రామచంద్రపురం నియోజవర్గ ప్రజలకు దక్కిన గౌరవంగా మంత్రి సుభాష్ అభివర్ణించారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు టిడిపిలో కొనసాగడం గొప్ప విషయం అన్నారు.

# ఎస్కలేటర్‌పై దిశా పటానీ టాప్ యాంగిల్ సరికాదేమో!



ప్రస్తుతం ముంబైలో జరుగుతున్న లక్మే ఫ్యాషన్ వీక్ గ్లామర్ ప్రపంచంలో హాట్ టాపిగ్గా మారింది. ఈ వేదికపై బాలీవుడ్ బ్యూటీ దిశా పటానీ తనదైన శైలిలో ర్యాంప్ వాక్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షించారు. అదిరిపోయే డిజైనర్ దుస్తుల్లో దిశా మెరిసిన తీరు ఫ్యాషన్ ప్రియులను మంత్రముగ్ధులను చేసింది. దిశాతో పాటు మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా వంటి టాప్ హీరోయిన్లు కూడా ఈ వేడుకలో పాల్గొని తమ తళుకుబెళుకులతో మురిపించారు. అయితే ఈ వేడుకలో దిశా పటానీకి సంబంధించిన ఒక వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో విమర్శలకు దారితీసింది. దిశా వేదికకు వెళ్లకకు వెళ్లే ముందు ఎస్కలేటర్ పై వెళుతుంటే.. ఒక వ్యక్తి తనను -టాప్ యాంగిల్-లో వీడియో తీయడం చర్చనీయాంశమైంది. ఒక దురభిమాని చేసిన ఈ పనిని నెటిజన్లు తీవ్రంగా తప్పుబడుతున్నారు. అభిమానం పేరుతో ఇలాంటి పనులు చేయడం ఏమాత్రం సరికాదని.. దీనిని -దురభిమానం-గా భావించాలని సోషల్ మీడియా వేదికగా మండిపడుతున్నారు. కథానాయికలు పబ్లిక్ ప్రాపర్టీ కాదు.. వారికి కూడా వ్యక్తిగత స్వేచ్ఛ, గౌరవం ఉంటాయని నెటిజన్లు హితవు పలుకుతున్నారు. వారు ధరించే దుస్తుల విధానాన్ని బట్టి వారిని తక్కువ చేసి చూడకూడదని.. సెలబ్రిటీల విషయంలో కనీస గౌరవంతో వ్యవహరించాలని సూచిస్తున్నారు. అసభ్యంగా ఫోటోలు తీయడం, రహస్యంగా వీడియోలు తీయడం వంటి చర్యలు నేటి డిజిటల్ యుగంలో పెరిగిపోతున్నాయని.. ఇలాంటి వికృత చేష్టలను కచ్చితంగా నిరసించాల్సిందేనని అభిప్రాయపడుతున్నారు. ఇక లక్మే ఫ్యాషన్ వీక్ విషయానికి వస్తే.. గత కొద్ది రోజులుగా ఈ ఈవెంట్ ముంబైలో ఎంతో ఘనంగా సాగుతోంది. ఈ ఏడాది ఫ్యాషన్ వీక్ ఐదు రోజుల పాటు జరగనుంది. ఇప్పటివరకు దిశా పటానీ, తమన్నా భాటియా, సారా అలీ ఖాన్, అనన్యా పాండే వంటి దాదాపు 15 మందికి పైగా అగ్ర కథానాయికలు పలు టాప్ బ్రాండ్ల తరపున ర్యాంప్ వాక్ చేసి సందడి చేశారు. మరో రెండు రోజుల్లో మరికొంతమంది స్టార్ సెలబ్రిటీలు ఈ వేదికపై మెరిసే అవకాశం ఉంది. ఫ్యాషన్ షోలు అనేవి కళను, సృజనాత్మకతను ప్రదర్శించే వేదికలు. అక్కడ నటీనటుల అందాన్ని ఆస్వాధించడంలో తప్పులేదు కానీ.. వారి గౌరవానికి భంగం కలిగించేలా ప్రవర్తించడం సభ్యసమాజానికి మంచిది కాదు. దిశా పటానీ వీడియో విషయంలో వ్యక్తమవుతున్న నిరసన.. భవిష్యత్తులోనైనా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలని కోరుకుందాం. ఇక కెరీర్ మ్యాటర్ కి వస్తే.. దిశా పటానీని చివరిగా తెలుగు ఆడియెన్ కల్కి 2898 ఏడి, కంగువ చిత్రాలలో వీక్షించారు. మళ్లీ ఎప్పుడు ఈ భామ సౌత్ లో కనిపిస్తుందో వేచి చూడాల్సి ఉంది. ఫ్లాపుల కారణంగా.. అటు హిందీలో ఈ భామ కెరీర్ అంతంత మాత్రంగానే సాగుతోంది.





## ధోనీ లేకుండానే బరిలోకి చెన్నై..
## RR vs CSK మ్యాచ్ పిచ్ రిపోర్ట్, ఫ్లేయింగ్ XI ఇదే!



ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు తన తొలి మ్యాచ్‌ను రాజస్థాన్ రాయల్స్ జట్టుతో గౌహతిలోని బర్సపరా స్టేడియంలో ఆడనుంది. ఈ మ్యాచ్‌కు ముందు చెన్నైకి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. జట్టు సీనియర్ ఆటగాడు ఎంఎస్ ధోనీ గాయంతో తొలి రెండు వారాలు అందుబాటులో ఉండడని ఫ్రాంచైజీ ప్రకటించింది. దీంతో జట్టులో పలు మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ మ్యాచ్‌లో సంజు శాంసన్‌పై ప్రత్యేక దృష్టి ఉంది. గతంలో రాజస్థాన్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన అతడు ఇప్పుడు సీఎస్కేలోకి మారి తొలి మ్యాచ్ ఆడనున్నాడు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌తో పాటు సర్ఫరాజ్ ఖాన్, మాథ్యూ షార్ట్, శివం దూబేలు బ్యాటింగ్‌లో కీలక పాత్ర పోషించనున్నారు. అయితే డెవాల్డ్ బ్రెవిస్ లేకపోవడం జట్టుకు పెద్ద లోటు అని చెప్పాలి. ఇక బౌలింగ్‌లో మ్యాట్ హెన్రీ, నూర్ అహ్మద్, ఖలీల్ అహ్మద్ బాధ్యతలు చేపట్టనున్నారు.

రాజస్థాన్ జట్టు విషయానికి వస్తే, వైభవ్ సూర్యవంశీ అద్భుతమైన ఆరంభం ఇవ్వాలని చూస్తున్నారు. యశస్వి జైస్వాల్, ధృవ్ జురెల్, కెప్టెన్ రియాన్ పరాగ్ బ్యాటింగ్‌లో కీలకం కానున్నారు. జోఫ్రా ఆర్చర్, ఆడమ్ మిల్నే, రవీంద్ర జడేజా లాంటి బౌలర్లు జట్టుకు అదనపు బలం. గౌహతిలోని బర్సపరా స్టేడియంలోని పిచ్ సాధారణంగా బ్యాటింగ్‌కు అనుకూలంగా కాదు.. ఇక్కడ బౌలర్లే ఎక్కువగా ఆధిపత్యం ప్రదర్శిస్తారు. మొదటి ఇన్నింగ్స్ సగటు స్కోరు సుమారు 146 పరుగుల వరకు ఉంటుంది. పెద్ద స్కోర్లు చాలా అరుదుగా నమోదవుతాయి.

**హెడ్ టు హెడ్ రికార్డులు:**
ఈ రెండు జట్లు ఇప్పటివరకు 32 మ్యాచ్‌లు ఆడగా, చెన్నై 16, రాజస్థాన్ 16 మ్యాచ్‌లలో గెలిచి సమానంగా నిలిచాయి. దీంతో ఈ మ్యాచ్ కూడా ఆసక్తికరంగా మారే అవకాశం కనిపిస్తుంది. మొత్తానికి ఇరు జట్లలో బలమైన ఆటగాళ్లు ఉండటంతో అభిమానులకు ఆసక్తికర పోరుని అందించే అవకాశం ఉంది.


**పిచ్ రిపోర్ట్:**
గౌహతిలోని బర్సపరా స్టేడియంలో పిచ్ ఫ్లాట్‌గా ఉండే అవకాశం ఉంది. లక్ష్యాన్ని ఛేదించే జట్టు పైచేయి సాధించే ఛాన్స్ కనిపిస్తుంది. వికెట్‌పై కొంత గడ్డి ఉన్నప్పటికీ, అది కేవలం ఉపరితలాన్ని పట్టుగా ఉంచడానికే మాత్రమే.. మంచు ప్రభావం వలన వేగవంతమైన అవుట్‌ఫీల్డ్ స్పిన్నర్లకు సమస్యగా మారనుంది.

RR vs CSK ప్లేయింగ్ XI:
రాజస్థాన్ రాయల్స్: యశస్వి జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ, రియాన్ పరాగ్ (కెప్టెన్), షిమ్రోన్ హెట్మెయర్, ధృవ్ జురెల్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, దసున్ షనక, జోఫ్రా ఆర్చర్, సందీప్ శర్మ, రవి బిష్ణోయ్, ఆడమ్ మిల్నే.

**ఇంపాక్ట్ ప్లేయర్ : అమన్ రావు**

చెన్నై సూపర్ కింగ్స్: సంజు శాంసన్ (వికెట్ కీపర్), రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), ఆయుష్ మాత్రే, సర్ఫరాజ్ ఖాన్, శివమ్ దూబే, ప్రశాంత్ వీర్, జామీ ఓవర్టన్, అన్షుల్ కాంబోజ్, రాహుల్ చాహర్, నూర్ అహ్మద్, ఖలీల్ అహ్మద్.
ఇంపాక్ట్ ప్లేయర్ : కార్తిక్ శర్మ

# రోహిత్ 2.0 రెడీ.. ప్రత్యర్థి జాగ్రత్తగా ఉండాల్సిందే!





ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ ని రోహిత్ శర్మ సూపర్ స్టార్ట్ చేశాడు. 200ం స్ట్రైక్ రేట్ తో హాఫ్ సెంచరీ చేసిన అతడిపై సర్వత్రా ప్రశంసలు వస్తున్నాయి. కేవలం 38 బంతుల్లోనే 78 రన్స్ చేసిన ముంబై జట్టు విజయంలో కీ రోల్ పోషించాడు. ఈ క్రమంలో టీమిండియా మాజీ క్రికెటర్ అనిల్ కుంబ్లే ఐపీఎల్ లోని మిగతా టీమ్స్ కి హెచ్చరించాడు. రోహిత్ 2.0 రెడీ అయింది.. ప్రత్యర్థి జట్లు జాగ్రత్తగా ఉండాలని సూచనలు జారీ చేశాడు. కోల్‌కతాపై రోహిత్ శర్మ ఆటను చూసిన తర్వాత ఒకటే చెబుదామని ఉందా అని అనిల్ కుంబ్లే పేర్కొన్నారు. మైదానంలో అతడు బంతిని ఎదుర్కొన్న తీరును చూస్తే ప్రత్యర్థికి హెచ్చరికలు పంపినట్లుగా అనిపిస్తోంది.. అత్యుత్తమ ఫామ్ లో ఉన్నప్పటి రోజులను మళ్లీ గుర్తు చేసేశాడు. వరుణ్ చక్రవర్తి, సునీల్ నరైన్, ముజరబాని లాంటి బౌలింగ్ లో ఈజీగా సిక్సులు కొట్టేశాడు. స్వల్ప విరామం తర్వాత స్టేడియంలోకి ఎంట్రీ ఇచ్చిన రోహిత్.. లయను అందుకోవడానికి కనీసం ఐదారు రోజుల సమయం పడుతుంది. కానీ, రోహిత్ పై ఆ ప్రభావం ఏమీ కనిపించలేదని కుంబ్లే వెల్లడించారు. కోల్‌కతా నైట్‌రైడర్స్ బౌలింగ్ లో వరుణ్ చక్రవర్తి, సునీల్ నరైన్ కీలకం.. కానీ, నరైన్ తన నాలుగు ఓవర్ల కోటా కూడా పూర్తి చేయలేకపోయడం అందర్నీ షాక్ కి గురి చేసింది. రోహిత్-- ర్యాన్ -రికెల్టన్ దెబ్బకి పవర్ ప్లేలోనే అతడికి బౌలింగ్ ఇవ్వకపోవడం తీవ్ర నిరుత్సాహ పరిచింది. సునీల్ నరైన్ బౌలింగ్ కి వచ్చే సమయానికి జరగాల్సిన పూర్తి నష్టం జరిగిపోయింది. ఇక్కడే కేకేఆర్ తమ విజయావకాశాలను పూర్తిగా దెబ్బ తీసుకుంది. వారి వనరులను కాస్త మెరుగ్గా ఉపయోగించుకోవాలని అనిల్ కుంబ్లే పేర్కొన్నారు.

# బంగ్లాదేశ్ క్రికెట్ ఫ్యాన్స్‌కి బ్యాడ్‌న్యూస్.. ప్రసార ఒప్పందాన్ని రద్దు చేసిన జియో



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టోర్నమెంట్ వేళ బంగ్లాదేశ్ క్రికెట్ ఫ్యాన్స్ కి షాకిచ్చింది. భారత్ కి చెందిన జియోస్టార్ బంగ్లాలో ఐపీఎల్ ప్రసార ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు వెల్లడించింది. ఐపీఎల్ ప్రసారాలపై గతంలో విధించిన నిషేధంపై పునరాలోచిస్తున్నట్లు అక్కడి సర్కార్ చెప్పిన తర్వాత ఈ పరిణామం జరగడం గమనార్హం. ఈ రద్దు తక్షణమే అమల్లోకి వస్తుందని టీస్పోర్ట్స్ (బంగ్లాదేశ్ బ్రాడ్కాస్టర్)కు జియోస్టార్ రాసిన లేఖ ఆధారంగా ఇంటర్నేషనల్ మీడియా కథనాలు తెలిపాయి. ఒప్పందం ప్రకారం భాగస్వామ్య పక్షం గడువులోగా చెల్లింపులు చేయడంలో ప్రతిసారి ఫెయిల్ కావడమే ఈ నిర్ణయానికి కారణమని సమాచారం. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ ఉన్న సమయంలో హిందూ మైనార్టీలపై జరిగిన దాడులు జరిగాయి. అలాంటి సమయంలో బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్ ను మినీ వేలంలో కేకేఆర్ రూ.9.20కోట్లకు సొంతం చేసుకోవడంపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. దాంతో బీసీసీఐ ఆదేశాల మేరకు అతడిని వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అనంతరం బంగ్లాదేశ్ సర్కార్.. తమ దేశంలో ఐపీఎల్ ప్రసారాలను నిలిపివేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. బంగ్లాలో కొత్తగా ఏర్పడిన సర్కార్ ఆ నిషేధంపై పునరాలోచిస్తామని సంకేతాలు ఇచ్చేసింది. ఇంతలోనే జియో డీల్ నుంచి బయటకు వచ్చేందుకు రెడీ అయింది. ఇందుకు భాగస్వాముల మధ్య ఉన్న ఆర్థికపరమైన లావాదేవీలే కారణమని సమాచారం. ప్రపంచంలోనే అత్యంత సంపన్న క్రికెట్ లీగ్ గా పేరుగాంచిన ఐపీఎల్ ను ఢాకా ఫ్యాన్స్ బాగా ఆదరిస్తారు. తాజా నిర్ణయం వ్యూయర్షిప్, ఫ్యాన్ ఎంగేజ్మెంట్ పై తీవ్ర ప్రభావం చూపించనుంది. కాగా, జియో నిర్ణయంతో ఐపీఎల్ ప్రసారాల కోసం 2027 వరకు టీస్పోర్ట్స్ కి ఉన్న పర్మిషన్స్ రద్దు అయ్యాయి.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776